ఆంధ్రజ్యోతి

గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 4 సెప్టెంబరు 2025



పల్లెలకు పైసలొచ్చాయ్!



జిల్లాల వారీగా నిధులు విడుదల ఇలా..		
జిల్లా	అన్‌టైడ్ నిధులు	టైడ్ నిధులు
• పల్నాడు	12,31,45,384	18,47,18,101
• బాపట్ల	9,34,29,265	14,01,43,899
• గుంటూరు	6,55,92,007	9,83,88,023

పంచాయతీలకు ఎట్టకేలకు నిధుల మోక్షం లభించింది. ఎనిమిది నెలల అనంతరం పంచాయతీల వారీగా వాటి బ్యాంకు ఖాతాలకు 15వ ఆర్థిక సంఘం రూ. 70.04 కోట్ల నిధులు జమ చేసే ప్రక్రియను ప్రభుత్వం బుధవారం ప్రారంభించింది. రెండు మూడు రోజుల్లో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పంచాయతీలకు నిధులు జమ అవుతాయని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు తెలిపారు.

పంచాయతీల ఖాతాలకు రూ 70.04 కోట్లు జమ

- ఎట్టకేలకు నిధులు విడుదల చేసిన ఆర్థిక సంఘం
- నిధుల విడుదలతో పంచాయతీల పాలక వర్గాల హర్షం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీలకు 2024-25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను జనవరిలోనే కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. అయితే ప్రభుత్వం ఈ నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా తన ఖాతాలోనే ఉంచుకుంది. పంచాయతీల సర్పంచ్‌లు ఉద్యమ బాట పట్టిన నేపథ్యంలో నిధులను విడుదల చేసింది. పంచాయతీలకు అన్‌టైడ్ గ్రాంటు కింద రూ 28.21 కోట్లు, టైడ్ గ్రాంటు కింద 41.82 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని జనాభా ప్రాతిపదికన పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. మొదటి విడతలో కొన్ని పంచాయతీలకు ఉన్న బకాయిలను కూడా ఆర్థిక సంఘం విడుదల చేసింది.



నిధులు విడుదలతో పంచాయతీలకు ఊరట

కనీసం బ్లీచింగ్ కూడా కొనలేని స్థితిలో పంచాయతీలు కొట్టిమిట్టాడుతున్న సమయంలో ఆర్థిక సంఘం నిధుల విడుదల ఊరట నిచ్చింది. మొత్తం నిధుల్లో 60 శాతం టైడ్ నిధులుగా, 40 శాతం అన్‌టైడ్ నిధులుగా విడుదలయ్యాయి. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారుల నిర్మాణం వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ.28.21 కోట్లలో పది శాతం విద్యుత్ బకాయిలకు కచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్‌ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం నిధులను కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలకు, కంప్యూటర్ల కొనుగోలు, స్టేషనరీ ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. అలాగే పాఠశాల భవనాల (మిగతా 8వ పేజీలో)

బార్లు బాధలు

రావాల్సిన దరఖాస్తులు ..

బాపట్ల జిల్లాలో తొలుత 17 బార్లకు నోటిఫికేషన్ వెలువడగా రెండింటికే మాత్రం నిబంధనల ప్రకారం దరఖాస్తులు రాగా 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీటికి కనీసం 60 దరఖాస్తులు రావాలి. అదేవిధంగా గుంటూరులో 67 బార్లకు 268, పల్నాడులో 30కి 120 దరఖాస్తులు ఈ నెల 14లోగా రావాల్సి ఉంది.



దరఖాస్తులకు స్పందన అంతంతే

- ఎక్సైజ్ అధికారులపై ఉన్నతాధికారుల కన్నెర్ర
- అన్నింటికీ లాటరీ జరగాలని అనధికారిక ఆదేశాలు
- నిర్దేశించిన స్థాయిలో దరఖాస్తులు రాకుంటే పోస్టింగులకే ముప్పు?
- గడువు పొడిగిస్తున్నా ముందుకురాని వ్యాపారులు.. తాజాగా రీనోటిఫికేషన్

• బాబ్బాబు దరఖాస్తు వేయండి

నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకారం మద్యం బార్లకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. రీ నోటిఫికేషన్ జారీ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా మొత్తం బార్లకు లాటరీ ప్రక్రియ జరగాల్సిందేనని ఉన్నతాధికారులు హెచ్చరించారు. దీంతో వ్యాపారులు దరఖాస్తులు వేసేలా ఎక్కడికక్కడ ఎక్సైజ్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. గతంలో బెదిరించగా వ్యాపారులు స్పందించలేదు. దీంతో ఇప్పుడు బతిమిలాడుకుంటున్నారు. కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలను కలిసి దరఖాస్తుల గండం నుంచి గట్టెక్కించాలని అభ్యర్థిస్తున్నారు. ఇద్దరు ముగ్గురు కలిసి నాలుగు దరఖాస్తులు వేస్తే ఆ బార్ వారికే వచ్చేలా చూస్తామని అధికారులు హామీ ఇస్తున్నట్లు సమాచారం. నిబంధనల విషయంలో కొంత లిబరల్‌గా కూడా ఉంటాం ముందు దరఖాస్తు చేయండని కూడా కోరుతున్నారు.

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

మద్యం బార్ల పాలసీ ఎక్సైజ్ అధికారుల పాలిట శాపంలా మారిందా అంటే చోటుచేసుకుంటున్న పరిణామాలు అలాగే ఉంటున్నాయి. గతంలో మద్యం వ్యాపారం అంటే పెద్దఎత్తున పోటీ ఉండేది. ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలోనే రూ.కోట్లతో ఖజానా నిండేది. గతంలో వైన్స్ లైసెన్సుల జారీలోనూ ఇదే పరిస్థితి. అయితే గత నెలలో బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా వ్యాపారుల నుంచి కనీస స్పందన లేకుండా పోయింది. గడువు పొడిగించినా మూడో వంతు బార్లకు కూడా లాటరీ తీయలేకపోయారు. ఈ పరిస్థితుల్లో తాజాగా ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ జారీ చేసింది. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారం భించింది. అయితే దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో అధికారుల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఒకవైపు ఉన్నతాధికారుల హెచ్చరికలు.. మరోవైపు వ్యాపారుల నుంచి స్పందన అంతంతే కావడంతో ఎటూ పాలుపోని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. రెండు సార్లు గడువు పొడిగించినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో రెండు రోజుల క్రితం బాపట్ల జిల్లా ఈఎస్‌ను కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయించారు. బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో దరఖాస్తులు పడకపోతే వాటి పరిధిలోని ఎక్సైజ్ సీఐలపై కూడా వేటు తప్పదనే సంకేతాలను ఉన్నతాధికారులు పంపించారు. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లాలో 15, గుంటూరు జిల్లాలో 67, పల్నాడులో 30 బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం తాజాగా రీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు, 15న లాటరీ ప్రక్రియ ముగించి బార్లను కేటాయించాలని అందులో తెలిపింది. ఈ క్రమంలో రంగంలోకి దిగిన అధికారులు దరఖాస్తుదారుల కోసం వేట మొదలుపెట్టారు. గతంలో నోటిఫికేషన్ వచ్చిన సమయంలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై ఎక్సైజ్ అధికారులు (మిగతా 8వ పేజీలో)

సీనియర్స్ విభాగంలో వేటపాలెం ఎడ్ల సత్తా
• ప్రత్తిపాడులో ముగిసిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు
8

పిడుగురాళ్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం
• జడ్పీ సీఈవో జ్యోతిబసు

నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత 6
పశ్చిమ డెల్టాకు 6,830 క్యూసెక్కుల నీరు

ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆనందం

- డ్రైవర్, కండక్టర్లకు డబుల్ అలవెన్స్
- స్త్రీశక్తి అమలు నేపథ్యంలో ప్రభుత్వం శుభవార్త
- ఇప్పటికే నైట్ అలవెన్స్, ప్రమాద బీమా పెంపుదల

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేలా స్త్రీశక్తి పథకం అమలు నేపథ్యంలో సిబ్బందికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డబుల్ డ్యూటీలకు వెళ్లే డ్రైవర్లు, కండక్టర్లకు డబుల్ అలవెన్స్ ప్రకటించింది. ఇది స్త్రీ శక్తి అమల్లోకి వచ్చిన ఆగస్టు 15 నుంచి చెల్లించేలా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ ఉద్యోగులపై తన ఉదారతను చాటుకుంటోంది. ఇప్పుడు ఇచ్చే అలవెన్స్‌కు రూ.200 అదనంగా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దాంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా జరుగు తోందని ఉద్యోగుల నుంచి పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ విలీన ప్రక్రియలో భాగంగా రాత్రిళ్లు విధులు నిర్వహించే డ్రైవర్లు, కండక్టర్లకు వచ్చే నైట్ అలవెన్స్‌ను కూడా రద్దు చేశా రు. నైట్ అలవెన్స్‌ల కోసం పలు దఫాలు అప్పట్లో ప్రభుత్వ పెద్దలకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఆర్టీసీ ఉద్యోగులకు దశ మారింది. డ్రైవర్, కండక్టర్లకు నైట్ అలవెన్స్ అమల్లోకి తీసుకురావడంతో పాటు గతంలో రూ.75 ఉన్న దానిని రూ.150కి పెంచారు. తద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 1500 మందికి పైగా లబ్ధి చేకూరనున్నది. స్త్రీ శక్తి పథకం అమల్లో భాగంగా డబుల్ డ్యూటీలు చేసే డ్రైవర్, కండక్టర్లకు కూడా అలవెన్స్‌లు పెంచారు. ఇప్పటి వరకు డబుల్ డ్యూటీలు చేసే డ్రైవర్లకు రూ.800 ఇచ్చే వారు, ఇకపై డ్రైవర్‌కు రూ.వెయ్యి ఇవ్వనున్నారు. కండక్టర్‌కు రూ.700 నుంచి రూ.900 పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమాద బీమాను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రమాదవశాత్తు మరణిస్తే గతంలో రూ.20 లక్షలు ఉండే బీమాను రూ.కోటికి పెంచారు. అంతేగాక ఆర్టీసీలో అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారు. ఆర్టీసీలో రాష్ట్రంలో 6500 మందికి ఉద్యోగోన్నతులు కల్పించారు. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉద్యోగోన్నతుల జాబితా సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.



నూతన జేసీగా అశుతోష్ శ్రీవాస్తవ

- భార్గవతేజకు పోస్టింగ్ చూపని ప్రభుత్వం



గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన జేసీ, అదనపు మేజిస్ట్రేట్‌గా అశుతోష్ శ్రీవాస్తవ నియమితు లయ్యారు. బుధవారం రాత్రి ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ నిర్వహించిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2021 సివిల్స్ బ్యాచ్‌కు చెందిన అశుతోష్ శ్రీవాస్తవ కొన్ని నెలల నుంచి పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్నారు. మధ్యప్రదేశ్‌కి చెందిన శ్రీవాస్తవ రాజీవ్‌గాంధీ ప్రౌడయోగికి విశ్వవిద్యాలయంలో బీఈ(ఎలక్ట్రానిక్స్) పూర్తి చేశారు. 31 ఏళ్ల వయస్సులోనే సివిల్స్‌లో 223వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. తొలుత అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అసిస్టెంట్ కలెక్టర్‌గా, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వంలో అసిస్టెంట్ సెక్రెటరీగా, తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా, ఐటీడీఏ పార్వతీపురం ప్రాజెక్టు అధికారిగా, పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. సంగీతంలోనూ ఆయనకు మంచి పట్టువున్నది. కాగా ఇంచుమించు ఏడాదికి పైగా గుంటూరు జేసీగా విధులు నిర్వహించిన అమిలినేని భార్గవతేజకు ప్రభుత్వం పోస్టింగ్ చూపించలేదు.

క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి



విద్యార్థులు చదువుతో పాటు 8
క్రీడల్లోనూ రాణించాలి
• మా రోజుల్లో మైదానాలు లేవు ఇప్పుడు మెండుగా సౌకర్యాలు
• మహిళా శిశు సంక్షేమ మంత్రి సంధ్యారాణి

యార్డులో హమాలీల నిరసన

- కూలి పెంచాలని గైర్హాజరు.. నిలిచిన లావాదేవీలు
- కలెక్టరేట్‌లో సంఘాల నేతలతో జేసీ చర్చలు.. సఫలం

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హమాలీ చార్జీలు పెంచాలంటూ మిర్చియార్డులో వివిధ ముఠా కార్మిక సంఘాలు బుధవారం నిరసన తెలిపాయి. వేకువజామునే యార్డు ప్రాంగణానికి చేరుకుని హమాలీలు ఎవరూ కూలి పనులకు హాజరు కాకుండా ఆందోళనలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న జేసీ భార్గవతేజ యార్డు అధికారులు, ముఠా కార్మిక సంఘాల నేతలను కలెక్టరేట్‌కు పిలిపించి చర్చలు జరిపారు. దిగుమతి కూలి టిక్కీ ఒకటికి రూ.8.20 నుంచి రూ.8.80, కొట్టు కాపలా కూలి టిక్కీ ఒకటికి రూ.8.31 నుంచి రూ. 8.92కు, కొట్టుముఠా (మిర్చి టిక్కీ కోయడం, ప్రదర్శించడం, కుట్టడం, కాటా వేయడం) పనికి రూ.12.50 నుంచి రూ.13.50కి పెంచేందుకు ది గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ అంగీకరించింది. దీంతో చర్చలు సఫలమైనట్లుగా కార్మిక నేతలు, అధికారులు ప్రకటించారు.



మిర్చియార్డులో ఆందోళన నిర్వహిస్తున్న ముఠా కార్మిక సంఘాల నాయకులు

అమల్లోకి పెరిగిన చార్జీలు

పెరిగిన చార్జీలు బుధవారం నుంచే అమలులోకి తీసుకొస్తున్నట్లు జేసీ తెలిపారు. ఈ కారణంగా యార్డుకు తీసుకొచ్చే ప్రతీ ఒక్క టిక్కీపై రైతు ప్రస్తుతం రూ.29.01 పైసలు భరిస్తుండగా ఇక నుంచి రూ.31.22 పైసలు చెల్లించాల్సి ఉంటుంది. సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ జూలైలో పెంచాల్సిన రేట్లను పెంచకుండా అటు అధికారులు, ఇటు కమీషన్ వ్యాపారులు జాప్యం చేశారన్నారు. అందుకే గత్యంతరం లేక తాము బంద్‌కు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు కోట మాల్యాద్రి, అరుణ్‌కుమార్, బీ వెంకటేశ్వరరెడ్డి, జగన్నాథం, జంగాల చైతన్య, నళినీ కాంత్, ఏఐటీయూసీ నాయకుడు రావుల అంజిబాబు, ప్రజాపోరు నాయకుడు కోటేశ్వరరావు, మేకల రవి, దొంత నాగగౌడ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యార్డుకు రూ.20 లక్షల నష్టం

హమాలీ రేట్ల పెంపు విషయంలో నాన్చుడు ధోరణి వల్ల కూలీల నిరసనతో యార్డు ఒక్క రోజులోనే రూ.20 లక్షల నష్టపోయింది. గత కొన్ని రోజులుగా మిర్చియార్డులోని వివిధ ముఠా వర్కర్స్ సంఘాలు కూలి రేట్లు పెంచమని కోరుతున్నాయి. అయితే అటు కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్, ఇటు అధికార యంత్రాంగం ఒక నిర్ణయం తీసుకోలేదు. దాంతో బుధవారం హమాలీలు బంద్ పాటించారు. దీంతో మిర్చియార్డులో ఒక్క టిక్కీ విక్రయం కూడా జరగలేదు. దుకాణాల వద్దకు ఎగుమతిదారులు వచ్చినా ట్రేడ్ బంద్ కారణంగా వెనుదిరగాల్సి వచ్చింది. దీంతో రూ.20 కోట్లకు పైగా లావాదేవీలు నిలిచిపోయాయి. దీని వలన మార్కెట్ ఫీజు రూపంలో ఒక శాతం గుంటూరు మిర్చి యార్డుకు సమకూరుతుంది. అంటే దాదాపుగా రోజుకు రూ.20 లక్షల ఆదాయం వస్తుంది. కూలీల నిరసన ఫలితంగా మార్కెట్ కమిటీ ఆదాయం నష్టపోవాల్సి వచ్చింది.

నేటి నుంచి యథావిధిగా లావాదేవీలు

యార్డులో గురువారం నుంచి లావాదేవీలు యథావిధిగా జరుగుతాయని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. రైతులు గురువారం యార్డుకు మిర్చి టిక్కీలను విక్రయానికి తీసుకోవచ్చని చెప్పారు.

ఎన్‌వోసీలపై నాన్చుడు

- సీఆర్‌డీఏలో నెలల తరబడి జాప్యం
- నిర్ణీత గడువు ముగిసినా ఫైళ్లపై కాలయాపన

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాణిజ్య సముదాయాల ఏర్పాటుకు ఎన్‌వోసీ జారీ చేయడంలో నెలల తరబడి జాప్యం జరుగుతోన్నది. పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ అధికారి కార్యాలయాల నుంచి నిర్ణీత వ్యవధికి కొంచెం అటుఇటుగా ఫైళ్లుక్లియర్ అవుతున్నా ఏపీసీఆర్‌డీఏ గుంటూరు జోన్ కార్యాలయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటున్నది. అక్కడికి వెళ్లిన ఫైళ్లను అధికారులు క్లియర్ చేయడం లేదు. దీంతో నిర్ణీత గడువు ముగిసినా ఎన్‌వోసీలు జారీ కాక దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. సీఆర్‌డీఏ అధికారు లకు అమరావతి రాజధాని పనులు, పరిపాలన వ్యవహారాలు చూసుకోవడంలోనే తలమునకలై ఉండటంతో ఫైర్ ఎన్‌వోసీ లాంటి ఫైళ్లను జారీ చేయడం లేదు. గతంలో సీఆర్‌డీఏకి ఫైలు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. ఏ కారణంతోనే ఫైళ్లు సీఆర్‌డీఏ కమిషనర్‌కి పంపుతుండటంతో రెవెన్యూ సేవలు కుంటుపడుతున్నాయి. జిల్లాలో ఏపీసీఆర్‌డీఏ పరిధిలోకి వచ్చే గ్రామీణ ప్రాంతాల్లో వాణిజ్య అభివృద్ధికి ఫైర్ ఎన్‌వోసీలు ప్రతిబంధకంగా మారాయి. గతంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల పరిధిలో స్థానిక సంస్థలే తనిఖీలు చేసి 60 రోజుల వ్యవధిలో ఎన్‌వోసీలు జారీ చేసేవి. వాటితో వాణిజ్య కార్యకలాపాలను యాజమాన్యాలు ప్రారంభించేవి. ఇప్పుడు సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాల్లో ఫైర్ ఎన్‌వోసీ జారీకి జిల్లాలోని ఉన్నతాధికారులంతా ఆమోదం తెలిపినా మంజూరు కావడం లేదు. కొన్ని దరఖాస్తులకు ఆరు నెలలు గడిచినా మోక్షం లభించడం లేదు. మరోవైపు తాడేపల్లి, చిలకలూరిపేట వంటి ప్రాంతాల్లో ఎన్‌వోసీలు స్థానికంగానే జారీ చేస్తున్నారు. ఎస్పీ, సబ్ కలెక్టర్/ఆర్‌డీవో, పురపాలక సంఘం కమిషనర్, అగ్నిమాపక శాఖ అధికారుల ఆమోదంతో ఎన్‌వోసీలు జారీ అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వచ్చేసరికి ఏపీసీఆర్‌డీఏకి ఫైళ్లు పంపుతుండటంతో చాలా కమర్షియల్ భవనాలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు జారీ కాక వాణిజ్య కార్యకలాపాలకు బ్రేక్‌లు పడుతున్నాయి. దీనిపై సీఆర్‌డీఏ అధికారులతో జిల్లా స్థాయి అధికారులు మాట్లాడినా ఉపయోగం లేకుండా పోయిందని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సీఆర్‌డీఏ జోనల్ ఆఫీసులో ఎన్‌వోసీలు జారీ చేసేలా అధికారాలను బదలాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పొదుపుపై వెసులుబాటు ఉండాలి

- బ్యాంకు అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి సూచన

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డ్రాక్రా సంఘాల సభ్యులు తమ అవసరాలకోసం పొదుపు నగదును ఎప్పుడు కావాలంటే అప్పుడు వాడుకునే వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి బ్యాంకు అధికారులను కోరారు. గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకు మేనేజర్లు, డీఆర్డీఏ సిబ్బందితో వర్కుషాపు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 20 వేల సంఘాల్లో 2 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని ఏటా సుమారు రూ.850 కోట్లు రుణాలు పొదుతూ 99 శాతం చెల్లిస్తున్నారన్నారు. మహిళా సంఘాలు ప్రతి నెలా సక్రమంగా గ్రూపు సమావేశాలు ఏర్పాటు చేసుకునేలా, పుస్తకాలు నిర్వహించుకునేలా, రుణాల కిస్తీలు, పొదుపులను సక్రమంగా చెల్లించేలా వెలుగు, డీఆర్డీఏ సిబ్బంది బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాలో సుమారు 74,966 మంది గ్రూపు సభ్యులకు రూ.876.4 కోట్ల రుణాలు కావాలని డీఆర్డీఏ క్రెడిట్ ప్లాన్‌ను డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి తెలిపారు. వ్యవసాయ రంగం కింద 33,816 మందికి రూ.407.55 కోట్లు, పడి పరిశ్రమ కింద 7,196 మందికి రూ.92.46 కోట్లు, సేవారంగం కింద 9,400 మందికి రూ.110.29 కోట్లు, ట్రేడింగ్ రంగం కింద 13,945 మందికి రూ.181. 22 కోట్లు, గృహ నిర్మాణం కింద 1,131 మందికి రూ.11.01 కోట్లు, తయారీ రంగం కింద 921 మందికి రూ.12.43 కోట్లు, పండ్ల తోటల కింద 437 మందికి రూ.5.23 కోట్లు రుణాల రూపంలో అందించా లని వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి



నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత

విజయపురిసౌత్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లను మూసివేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 586.10 అడుగులుగా ఉంది. ఇది 300.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5654 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,307, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు మొత్తంగా 52,661 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో గా 52,661 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పశ్చిమడెల్టాకు 6,830 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 6,830 క్యూసెక్కుల నీరు బుధవారం విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 60,150 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 296 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1,748 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 598 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 204 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 200 క్యూసెక్కులు, కొమ్మ మూరు కాల్వకు 3320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్‌లో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

❖ పులిచింతలకు 34,118 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల,సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టులో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.177 ఎంయూ (మిలియన్ యూనిట్)ల విద్యుత్‌ను తయారు చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను 1.5 మీటర్లు, 1 గేట్‌ను 1 మీటర్ మేర ఎత్తి 25,492 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8,626 క్యూసెక్కులు మొత్తంగా 34,118 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.02 టియంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుండి 36వేల 172 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 1700 క్యూసెక్కుల నీరు లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 2100 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 639 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9600, గరిష్ఠ ధర రూ.10,851, మోడల్‌ధర రూ.10,485 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,600, గరిష్ఠ ధర రూ.10,650, మోడల్‌ధర రూ.10250 పలికాయి.

తగ్గుముఖం పట్టిన వరద

● ఊపిరిపీల్చుకుంటున్న తీరప్రాంత ప్రజలు




వరద ఉధృతి తగ్గటంతో బయటపడ్డ పెనుమూడి పుష్కరఘాట్ మెట్లు

రేపల్లె, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద ఉధృతి తగ్గటంతో తీర ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వరదనీరు క్రమేపీ తగ్గటంతో మండలంలోని పెనుమూడి కృష్ణానదికి వరద ఉధృతి తగ్గి పుష్కరఘాట్ మెట్లు బయటపడ్డాయి. వరద ఉధృతి తగ్గటంతో కృష్ణాకరకట్ట పరిసరప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. భట్టిప్రోలు మండలం లంకగ్రామాలైన పెసర్లంకకు వెళ్ళే చిన్నరేవుల్లో వరదనీరు ఇంకా పూర్తిగా తగ్గలేదు. రాకపోకలు నిలిచిపోయి ఉన్నాయి. వాణిజ్యపంటల్లో చేరిన వరదనీరు బయటకు వెళ్ళటంతో రైతులు కొంత ఉపశయనం పొందారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద శాంతించిన కృష్ణమ్మ

● దిగువకు 36,250 క్యూసెక్కుల నీటి విడుదల



దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణమ్మ శాంతించింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 52,591 క్యూసెక్కుల వరదనీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదవగా దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. తూర్పు డెల్టా కాలువ కు 9,236 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,105 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు ఛానల్‌కు నీటి విడుదలను నిలిపివేసినట్లు రాజేశ్ తెలిపారు.

పిడుగురాళ్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం

● గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసు ● నకరికల్లు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



నకరికల్లులో మాట్లాడుతున్న గుంటూరు జడ్పీ సీఈఓ జ్యోతిబసు

నకరికల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న పిడుగురాళ్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం వేయనున్నట్లు జడ్పీ సీఈవో వీ జ్యోతిబసు తెలిపారు. మూడేళ్ల కాల పరిమితి ముగియడంతో ఈ వేలం నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. నకరికల్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ జనరల్ ఫండ్, జిల్లా పరిషత్ జనరల్ ఫండ్, 15 ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వినియోగించారా లేదా అనే అంశాలను పరిశీలించారు. పంచాయతీరాజ్ రికార్డులను, రిజిస్టర్లను, బిల్లులను అన్నింటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రోడ్ల నిర్మాణం కోసం జిల్లా పరిషత్తు నిధులను రూ.22 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. తాగునీటి పథకాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.31 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి ఆదర్శ యోజన పథకం కింద షెడ్యూల్ కులాల అత్యధిక జనాభా కలిగిన 9 గ్రామ పంచాయతీలకు ఒక్కో పంచాయితీకి రూ. 20 లక్షలు చొప్పున రూ.1.80 కోట్లు కేటాయించినట్లు వివరించారు. రెండో విడతలో భాగంగా గ్రామ అభివృద్ధి పథకంలో ఎంపీడీవోల ప్రతిపాదనల ఆధారంగా కేటాయింపులు చేస్తామని తెలిపారు. ఈ నిధులను సీసీ రోడ్లు, డ్రైనేజీల, కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం వెచ్చించనున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టే మెటీరియల్ బిల్లులకు మ్యాచింగ్ గ్రాంట్ సమకూరుస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల పదోన్నతుల్లో భాగంగా ఈపూరు, క్రోసూరు, పెదకూరపాడు, దాచేపల్లి, దుర్గి, కారంపూడి, రెంటచింతల, నగరం, రేపల్లె, తాడేపల్లికి ఎంపీడీవోలను నియమించనున్నట్లు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో నియామక ఉత్తర్వులను జారీ చేస్తామని జ్యోతిబసు స్పష్టం చేశారు. నకరికల్లుతో పాటు నరసరావుపేట, ఫిరంగిపురం మండలాల రికార్డులను పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు.

రౌడీషీటర్లపై పోలీసుల ఉక్కుపాదం

● డీజీపీ ఆదేశాలతో స్టేషన్‌ల వారీగా వివరాల సేకరణ

సత్తెనపల్లి సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. సత్తెనపల్లి సబ్‌డివిజన్‌లో పోలీసుస్టేషన్‌ల వారీగా రౌడీషీటర్లు ఎంతమంది ఉన్నారు, వారు ఇంకా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారా నాయకులతో అంటకాగుతూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారా అనే దిశగా వారు వివరాలు సేకరిస్తున్నారు. పదేపదే నేరాలు చేస్తున్న రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తాజాగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలు ఇవ్వడంతో పోలీసు అధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. రౌడీషీటర్లు ఎంతమంది క్రియాశీలకంగా ఉన్నారు, వారంతా ఎక్కడెక్కడ తిరుగుతున్నారు అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇందులో భాగంగా సత్తెనపల్లిలో నేరచరిత్ర కలిగిన ఇద్దరు యువకులను కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు రాజమండ్రి జైలుకు తరలించారు.

ఆంధ్రా జాలర్లపై తెలంగాణ జాలర్ల దాడి

రెంటచింతల,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రాళ్లగుట్ట వద్ద చేపలు పట్టడానికి వచ్చిన ఆంధ్రా జాలర్లపై తెలంగాణాకు చెందిన వారు దాడి చేసి దుర్భాషలాడారు. విజయపురిసౌత్‌కు చెందిన ఆంధ్రా జాలర్లు వలలు వేసి చేపలు పడుతున్న సమయంలో ఆవలి ఒడ్డున ఉన్న తెలంగాణకు చెందిన పలువురు జాలర్లు నది దగ్గరకు చేరుకుని చేపలు పట్టే హక్కులేదని వాదనకు దిగారు. మాటా మాటా పెరగడంతో పాటు తెలంగాణాకు చెందిన 15 మంది వ్యక్తులు విచక్షణారహితంగా ఆంధ్రాజాలర్లపై దాడి చేశారు.ఈ మేరకు స్థానిక స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆర్డీవో మురళీ కృష్ణ, తహసీల్దార్ మేరీ కనకంతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఏఎన్‌యూలో రూసా హబ్ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఉపకులపతి ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రూసా 2.0 కింద రూసా హబ్ కేంద్రంతో పాటు రీసెర్చ్ ఇన్నోవేషన్ కేంద్రం భవన నిర్మాణానికి బుధవారం ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం భూమి పూజ చేశారు. రూసా నిధుల కింద సుమారు రూ.4 కోట్లతో ఈ నిర్మాణం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రూసా సమన్వయకర్త ఆచార్య మురళీమోహన్, ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య వీరయ్య, దూరవిద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్, సీడీసీ డీన్ ఆచార్య రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, యూజీ పరీక్షల సమన్వయకర్త కృష్ణారావు, విదేశీ విద్యార్థుల కేంద్రం సమన్వయకర్త పద్మావతి పాల్గొన్నారు.

నవంబరు 4 నుంచి మారనున్న డెల్టా ఎక్స్‌ప్రెస్ వేళలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేపల్లె-వికారాబాద్ మార్గంలో నడిచే డెల్టా ఎక్స్‌ప్రెస్ (17626) నవంబరు 4నుంచి మారనున్నాయి. ప్రస్తుతం రేపల్లె నుంచి ప్రతిరోజూ రాత్రి 10.40గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు తర్వాతి రోజు ఉదయం 7.20గంటలకు చేరుకుంటోంది. నవంబరు 4నుంచి వేళల్లో మార్పు కారణంగా ఈ రైలు సికింద్రాబాద్‌కు 45 నిమిషాలు ముందే (ఉదయం 6.35గంటలకు) రానుంది. వికారాబాద్‌కు ప్రస్తుతం చేరుకునే సమయం (9.40) కన్నా 20నిమిషాల ముందుగానే (9.20గంటలకు) రానుంది.

కార్యకర్తలు చేజారిపోతున్నారనే కాసు రెచ్చగొట్టే వ్యాఖ్యలు

● కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కక్షసాధింపులు లేవు
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గురజాల అభివృద్ధికే తాను పనిచేస్తున్నానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ అనేక గ్రామాలలో కూటమి నేతలపై అక్రమ కేసులు, మహిళలపై అత్యాచారాలతో పాటు మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లోనే అనేక సభలలో కక్ష సాధింపులు ఉండవని, ఎవరికి ఇష్టమైన పార్టీలో వారు కొనసాగవచ్చని హామీ ఇచ్చిందని చెప్పారు. చేతనైతే తమతో కలిసి వచ్చి గ్రామాలను అభివృద్ధి చేయాలి కాని అనవసరమైన గొడవలకు పోయి జీవితాలు పాడు చేసుకోవద్దని పలుమార్లు బహిరంగంగా తాను చెప్పానని యరపతినేని గుర్తుచేశారు. కాసు మహేష్‌రెడ్డి కార్యకర్తలను కాపాడుకునేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వారిని కేసుల్లో ఇరికించి తనచుట్టూ తిప్పుకునే విధంగా చేస్తున్నారని ఆరోపించారు. దానిని వైసీపీ నేతలు, కార్యకర్తలు గమనించాలని అన్నారు. వైసీపీ నేతల ప్రసంగాలను, రెచ్చగొట్టే వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వారు ఒక సీటుకే పరిమితం అవుతారేమోనని అనుమానంగా ఉందని ఎమ్మెల్యే యరపతినేని పేర్కొన్నారు.

కాసు మాటలు అహంకారానికి నిదర్శనం

● పల్నాడులోని పలు స్టేషన్లలో ఆయనపై కూటమి నేతల ఫిర్యాదు



మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై దాచేపల్లి పోలీస్‌స్టేషన్లో సీఐ భాస్కరరావుకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

దాచేపల్లి/పిడుగురాళ్ల/గురజాలటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే కత్తులు, గొడ్డళ్లతో సమాధానం చెబుతామంటూ రెచ్చగొడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాటలు ఆయన అహంకారానికి నిదర్శనమని కూటమి నేతలు ఆరోపించారు. బుధవారం దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం, గురజాల పోలీస్ స్టేషన్‌లలో కాసు మహేష్‌రెడ్డిపై ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ కాసు మహేష్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. పిడుగురాళ్ల పట్టణంలో జరిగిన స్త్రీశక్తి విజయోత్సవ సభకు విశేషంగా మహిళలు వచ్చి విజయవంతం చేయడం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలతోపాటు అభివృద్ధి చేపడుతూ ముందుకు నడుస్తున్న కూటమి ప్రభుత్వం ఆదరణను జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు వస్తున్న ప్రజాదరణ చూసి మహేష్‌రెడ్డి పిచ్చెక్కినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 11 మంది టీడీపీ కార్యకర్తలు హత్యలకు గురయ్యారని, 8 మంది చిన్నారులు అక్రమంగా మైనింగ్ చేసిన క్వారీలో పడి చనిపోయారని ఆరో పించారు. 80 మంది కాళ్లు, చేతులు విరగొట్టారని, మహిళలపై అత్యాచారాలు జరిపారని, పలువురి ఆస్తులను ఆక్రమించుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వ్యాపారస్తులు, రైతాంగం, ఉద్యోగస్తులు, మహిళలు ప్రశాంతంగా ఉంటే మరలా ఓడిపోతామనే భయంతో కాసు గొడ్డళ్లు, కర్రలు పేరుతో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. 2029లోనూ ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, కాసు నోరు అదుపులో ఉంచుకోవాలని హెచ్చరించారు.

రాష్ట్ర సచివాలయ ఉద్యోగినికి సైబర్ కేటుగాళ్ల టోకరా

● సీఐడీ నుంచి మాట్లాడుతున్నామంటూ రూ. 80 వేలు కాజేత
● తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

తుళ్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మేం సీఐడీ నుంచి మాట్లాడుతున్నాం.. మీ మీద కేసులు నమోదయ్యాయి, అవి మాఫీ కావాలంటే రూ. 80వేలు చెల్లించండి లేకపోతే అరెస్టు తప్పదంటూ వెలగపూడి రాష్ట్ర సచివాలయ ఉద్యోగినికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. భయపడి వారు అడినదంతా చెల్లించిన ఉద్యోగిని ఆ తర్వాత తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. రాష్ట్ర సచివాలయంలోని ఓ సెక్షన్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినికి బుధవారం అరవింద్ అనే పేరుతో ఓ వ్యక్తి ఆన్‌లైన్ కాల్ చేశాడు. తాను సీఐడీ పోలీసులనని చెప్పిన అతడు మీ మీద కేసులున్నాయి, మాఫీ చేయాలంటే రూ. 80 వేలు తక్షణం చెల్లించాలి, లేకపోతే అరెస్టు తప్పదని ఆమెను బెదిరించాడు. దాంతో భయపడిన ఆ మహిళా ఉద్యోగి కంగారులో ఫోన్ పే ద్వారా రూ. 80 వేలు చెల్లించారు. ఆ తరువాత వాకబు చేయగా సీఐడీ పేరుతో బెదిరించి ఎవరో తన నుంచి డబ్బులు కాజేశారని తెలుసుకొని తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

మందుల అక్రమ వ్యాపారికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమాన

గుంటూరు మెడికల్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మందులను దొంగిలించి వాటి పేర్లు, స్టిక్కర్లు మార్చి అక్రమంగా విక్రయిస్తున్న నిందితుడికి కోర్టు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. తెనాలికి చెందిన దేసు నాగేశ్వరావు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వ ఈఎస్ఐ ఆసుపత్రులకు చెందిన 53 రకాల మందులతోపాటు మొత్తం 67 రకాల మందులను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తుండగా ఔషధ నియంత్రణశాఖ అధికారులు దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. అందులో కొన్ని మందులకు గడువుతేదీ దాటడంతో వాటిపై స్టిక్కర్లు తొలగించి కొత్తవి అంటించినట్లు గుర్తించారు. క్యూర్‌టెక్ ఫార్ములేషన్ లిమిటెడ్ ద్వారా తయారైనట్లు చెప్పిన నకిలీ ఎఫ్ఐఎక్స్ 200 మందులను కూడా అతడు నిల్వ చేసి విక్రయించినట్లు అధికారులు కనుగొన్నారు. దేసు నాగేశ్వరరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా విచారించిన అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వీఏఎల్ సత్యవతి నాగేశ్వరావు తప్పు రుజువు కావడంతో అతడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆంధ్రా నుంచి తెలంగాణకు అక్రమంగా యూరియా తరలింపు

● పోలీసుల అదుపులో నిందితులు

దాచేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి తెలంగాణకు ఆటోలో అక్రమంగా తరలిపోతున్న యూరియాను పొందుగల చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యూరియా ఉన్న ఆటోను సీజ్ చేసి నిందితులను అరెస్టు చేశారు. దాచేపల్లి ఎస్సై సౌందర్ రాజన్ వివరాల ప్రకారం, దాచేపల్లి మండల పరిధిలోని పొందుగల గ్రామం వద్దనున్న రాష్ట్ర పోలీసు చెక్ పోస్టు వద్ద అధికారులు సాధారణ తనిఖీలు చేస్తుండగా యూరియా కట్టల లోడుతో ఉన్న ఆటో వారి కంటబడింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆటోలోని 14 యూరియా కట్టలను స్వాధీన పరుచుకొని, యూరియాను తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఎటువంటి అనుమతుల్లేకుండా యూరియా కట్టలను తరలిస్తున్న ఓ ఉద్యోగిపై కూడా అధికారులు విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే అధికారులు పూర్తిస్థాయిలో యూరియా కట్టల నిల్వలున్నాయని చెబుతున్నప్పటికీ తెలంగాణకు చెందిన కొంత మంది వ్యక్తులు ఆంధ్రా రైతుల ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాల జిరాక్స్‌లు చూపుతూ యూరియా కట్టలను తరలించే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి దీని వెనుక ఉన్న వ్యక్తులను గుర్తిస్తామని అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న మిళింద్ పరాండే, పాల్గొన్న వీహెచ్‌పీ కార్యకర్తలు

హిందూ జనాభా తగ్గుదల ఆందోళనకరం

● వీహెచ్‌పీ అంతర్జాతీయ ఆర్గనైజేషన్ కార్యదర్శి మిళింద్ పరాండే

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలో హిందువుల జనాభా గణనీయంగా తగ్గిపోవడంపై విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ ఆర్గనైజేషన్ కార్యదర్శి మిళింద్ పరాండే ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు లక్ష్మీపురం, కాటన్ అసోసియేషన్ కార్యాలయంలో, నెహ్రూనగర్‌లలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మధ్యకాలంలో ముస్లీం, క్రిస్టియన్ కుటుంబాల కంటే హిందువుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. జననం శాతం 2.5 ఉండాలని, కాని 1.5 శాతంకు పడిపోయిందన్నారు. ప్రస్తుత తరంలో హిందూ కుటుంబాల్లో కనీసం ఇద్దరు పిల్లలు ఉండాలన్నారు. అప్పుడే యంగ్ హిందూ ఇండియా సిద్ధిస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న దేవాలయాలను హిందూ, ధార్మిక సంఘాలకు అప్పజెప్పాలన్నారు. మసీదులు, చర్చిలు మాదిరిగానే ఆలయాలు కూడా ఆయా సంఘాలే నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని, త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాల్లో ప్రజలను చైతన్యపరిచి మాత మార్పిడులు జరగకుండా చూడాలన్నారు. అనంతరం నగరంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను సందర్శించి, పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అంతర్జాతీయ సంయుక్త కార్యదర్శి వై.రాఘవులు సంఘ రాష్ట్ర నాయకులు తనికెళ్ల రవి, సుబ్బరాజు భూపతి, డాక్టర్ నిరంజనరావు జిల్లా సభ్యులు మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లను ప్రజలు ఆదరిస్తున్నారు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): అన్నక్యాంటీన్లను పేదల ఆకలి తీర్చే అన్నపూర్ణగా ప్రజలు ఆదరిస్తున్నారని, క్యాంటీన్ కి వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహారం అందించేందుకు అక్షయ పాత్ర సిబ్బంది చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆర్టీఓ ఆఫీస్ దగ్గరలోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

రోడ్లమీద వాహనాలు పార్కింగ్ చేయరాదు

గుంటూరు నగరంలో ప్రధాన రహదారులు వ్యాపార సంస్థల పార్కింగ్ వినియోగానికి కాదని, ప్రజల వాహనాలు రాకపోకలకని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కమిషనర్ పట్టాభిపురం మెయిన్ రోడ్, జేకేసి కాలేజి రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, రోడ్ల ఆక్రమణలను, అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో హోటల్స్, షాపింగ్ మాల్స్ వంటి సంస్థలు తమ భవన ప్రాంతాల్లోనే పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని, అలా కాకుండా ట్రాఫిక్‌కి అడ్డుగా రోడ్లను ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్ల మీద, డ్రైన్ల మీద ఆక్రమణలు లేకుండా సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి బాధ్యత తీసుకోవాలన్నారు.



పైపులైను పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

● జేకేసీ కాలేజి రోడ్ లో పైప్ లైన్ లీకు వర్క్ ని పరిశీలించి లీకు మరమ్మతు పనులను నాణ్యతగా, వేగంగా చేయాలన్నారు. అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్ లో పర్యటించి రోడ్ల పక్కన వ్యర్థాలు వేయకుండా ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని, సెంట్రల్ డివైడర్ లో పచ్చదనం పెంపుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్, డీఈఈ రమేష్ బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 9న నిరసనలు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి

గుంటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై ఈనెల 9న అన్ని డివిజనల్ కేంద్రాల్లో వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోనున్న కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యూరియా అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇన్‌ఛార్జ్ పోతిన మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరతతో పాటు ఇటీవల వరదలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 9వ తేదీని వైసీపీ నాయకులు నిరసనలు తెలియజేసి అనంతరం ఆర్డీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, అంబటి మురళీ, వనమా బాలవజ్రబాబు, షేక్ నూరిఫాతిమా, డొంతిరెడ్డి వేమారెడ్డి, మెట్టు వెంకటప్పారెడ్డి తదితరులున్నారు.

రైల్వే పింఛన్‌దారుల సంఘానికి స్థలాలు కేటాయించాలి

● ది రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైల్వే పింఛన్‌దారుల సంఘానికి ఆఫీసు ఏర్పాటు కోసం స్థలాలు కేటాయించాలని ది రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవత్సవ, పీసీఎండీ డాక్టర్ నిర్మల నరసింహన్, సీపీవో ఐఆర్ రమణారెడ్డిలను బుధవారం కలిసి వినతి పత్రాలను సమర్పించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ రైల్వే ఆస్పత్రిలో వైద్యం పొందే విషయంలో విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిపైనా ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు రావు బాబు, కే.నారాయణరెడ్డి, ఎస్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి, రైతాంగానికి ఎరువులు సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8వ తేదీన సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో జరిగే ధర్నాలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా, డీఏపీ వంటి ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో జరిగే నిరసనలను జయప్రదం చేయాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గురువారం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కోటా మాల్యాద్రి, ఆకిటి అరుణ్‌కుమార్, వలీ, జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

ఇంటి వద్దకే క్యూఆర్ కోడ్ ఆధారిత

● జేసీకి పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాలు





రేషన్ డీలర్లకు పంపిణీ చేస్తున్న నూతన పరికరాలు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ విషయంలో అస్పష్టత తొలగిపోయింది. ఇప్పటివరకు రేషన్ డీలర్లు పంపిణీ చేయాలని రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతూ వచ్చారు. మరోవైపు కార్డుల పంపిణీ తమ బాధ్యత కాదంటూ డీలర్లు చాలావరకు చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ బుధవారం జాయింట్ కలెక్టర్లకు ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే గ్రామ/వార్డు సచివాలయాల సెక్రెటరీలు వెళ్లి పంపిణీ చేయాలని జేసీతో పాటు జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్‌కు సూచనలు ఇచ్చారు. కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాలతో ప్రతీ ఒక్క రేషన్‌షాపుని ఒక సచివాలయ సెక్రెటరీకి మ్యాపింగ్ చేశారు. దీంతో ఆయా సెక్రెటరీలు గురువారం నుంచి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్మార్ట్ రైస్‌కార్డులను పంపిణీ చేస్తారు. స్మార్ట్ రైస్‌కార్డులను పంపిణీ చేసే విషయంలో సచివాలాయల సెక్రెటరీల పాత్రను కూడా కమిషనర్ పేర్కొన్నారు. సెక్రెటరీలు తమకు కేటాయించిన దుకాణాల పరిధిలోని కార్డుదారుల ఇంటికి వెళ్లి డోర్ డెలివరీ చేయాలి. కార్డుదారుడి డిజిటల్ రశీదు(బయోమెట్రిక్/ఐరిస్/ఓటీపీ/ముఖ) డెలివరీ సమయంలో సంగ్రహించాలి. జాయింట్ కలెక్టర్లు జిల్లాలో స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీని పర్యవేక్షించాలి. ఎఫ్‌పీ షాపు డీలర్లు జీఎస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులకు పంపిణీ, రశీదులో పూర్తి సహకారాన్ని అందించేలా చూడాలి. పౌరసరఫరాల, రెవెన్యూ అధికారుల ద్వారా సరైన పర్యవేక్షణ యంత్రాంగాలను కలిగివుండేలా చూసుకోవాలి. పనిని పూర్తి చేయడానికి రోజువారి డ్యాష్‌బోర్డులు, పురోగతి నివేదికలు సమీక్షించాలి. ఏదైనా అవకతవకలు జరిగితే తక్షణ దిద్దుబాటు చర్యలను ప్రారంభించాలి.

డీలర్లకు కొత్త పరికరాల పంపిణీ

క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైసుకార్డులను పంపిణీ చేస్తున్న దృష్ట్యా రేషన్ పంపిణీలో అవకతవకలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పరికరాలను డీలర్లకు పంపిణీ చేయడం ప్రారంభించింది. గతంలో ఈ-పోస్ యంత్రానికి వలే దీనికి ఎలాంటి బటన్‌లు లేవు. అంతా టచ్ స్క్రీన్ ఆధారంగానే పని చేస్తుంది. వేలిముద్ర వేయడానికి డివైస్ వెనకవైపున సదుపాయం కల్పించారు. క్యూఆర్ కోడ్‌ని స్కానింగ్ చేసే సదుపాయం కూడా ఈ యంత్రానికి ఉంటుందని అధికారులు తెలిపారు. కార్డుని ట్యాప్ చేయడం/స్వైపింగ్/ఇన్‌సర్ట్ చేసి రేషన్ సరుకులు తీసుకొనే వీచర్లను ఈ నూతన పరికరం కలిగివున్నది.



సమావేశంలో మాట్లాడు తున్న జేసీ భార్గవ్ తేజ

77 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం విస్తరణ : జేసీ

గుంటూరు సిటీ,సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది గుంటూరు జిల్లాలోని 77 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరిస్తునట్లు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంపై గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వార్షిక కార్యాచరణ ప్రణాళిక పై సమన్వయ సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అనుబంధ శాఖల అధికారులు సమన్వయం తో కేంద్ర ప్రభుత్వ పథకాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సన్నాహక దశలో జిల్లా, మండల స్థాయిలలో విభాగాల సమన్వయ సమావేశాలు జరుగుతాయన్నారు. ప్రచార దశలో ప్రతి గ్రామంలో సమావేశాలు, మోడల్ ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. నమోదు దశలో గ్రామంలోని అన్ని కుటుంబాల వార్షిక వ్యవసాయ ప్రణాళికలు తయారు చేసి, రైతులను సహజవ్యవసాయంలోకి తీసుకువస్తారని పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియను సెప్టెంబర్ నెలలో పూర్తి చేసి రాబోయే రబీ సీజన్‌కి సిద్ధం చేయాలనీ అధికారులకు సూచించారు. రైతులందరినీ అనుభంద శాఖ అధికారులు సమన్వయం తో పని చేసి ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి పథం లో నడిపించాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు మాట్లాడుతూ రైతులందరి చేత రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా వారికి అవగాహన కల్పించే బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకాన్ని 77 గ్రామాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 21,957 మంది రైతులు 26,083 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీ ఎస్ ఎఫ్ జిల్లా యాంకర్ గోపీచంద్ , డీహెచ్‌ఓ నరేంద్ర కుమార్ , డీఆర్‌డీఏ పీడీ తలారి వెంకట విజయ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీఏ మేనేజర్ అశోక్ కుమార్‌కు సన్మానం

గుంటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన వర్కుషాపులో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ టీ. అశోక్‌కుమార్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సన్మానించారు. సస్టైనబుల్ లైవ్లీహుడ్ త్రూ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పొందిన సందర్భంగా కలెక్టర్ ఆయనను సన్మానించారు. చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల కామర్స్ విభాగానికి చెందిన కే శారదా దేవి పర్యవేక్షణలో ఆయన ఈ అంశంపై థీసిస్ రూపొందించారు. నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ డీన్ కే. శివరామ్ వైవా నిర్వహించి, డాక్టరేట్ అందజేశారు.



అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

వెల్లివిరిసిన మత సామరస్యం

● వేలంలో లడ్డూను దక్కించుకున్న ముస్లిం దంపతులు



లడ్డూను దక్కించుకున్న ముస్లింలు

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి కాలనీలోని జనచైతన్య హ్యాపీ హోమ్స్ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్న గణనాథుడి ఉత్సవాల్లో మత సామరస్యం వెల్లివిరిసింది. బుధవారం షేక్ బాషా, జరీనా దంపతులు లడ్డూ బహూకరించగా వేలంలో హుస్సేన్, ఖాదర్బీ దంపతులు రూ.75వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అలానే కామర్‌బేగం దంపతులు వినాయకుని పంచెను రూ.3వేలకు పాడుకోగా కందువాను రామకృష్ణ, కవిత దంపతులు రూ.7వేలకు దక్కించుకున్నారు. సర్వమత సమ్మేళనంగా గణనాథుడి ఉత్సవాలు జరుపుకోవటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘ మాజీ అధ్యక్షుడు మృతి

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కంచర్లపల్లి వెంకట చలపతిరావు బుధవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కృష్ణా జిల్లాకు చెందిన చలపతిరావు హైదరాబాదులో కానిస్టేబుల్‌గా ఎంపికై, సైబరాబాద్ సిటీలో పనిచేస్తూ 2010 నుంచి 2014వ సంవత్సరం వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పోలీసు సంఘం అధ్యక్షుడిగా, పోలీసు శాఖలో ఏఎస్‌ఐగా విశేష సేవలందించారని ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి ఆకుల అశోక్ కుమార్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి దళవాయి సుబ్రహ్మణ్యం, ప్రస్తుత గుంటూరు జిల్లా అసోసియేషన్ సభ్యులు లక్ష్మయ్య, జేవీ, బేబీ రాణి, షేక్ హుస్సేన్, అంకుశం సాంబశివరావు తదితరులు నివాళులర్పించారు.

862 జీవోను రద్దు చేయాలి

● భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సాయిబాబా శతజయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలనే ప్రభుత్వ జీవో 862ను వెంటనే రద్దు చేయాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు సదరు జీవో ప్రతులను చింపి నిరసన తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శత జయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలని, ప్రభుత్వం జీవో తీసుకురావటం రాజ్యాంగంలోని లౌకికవిధానానికి విరుద్ధమన్నారు. వెంటనే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో గుంటూరు జిల్లా హేతువాద సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మమతా చంద్రశేఖర్, అంబేడ్కర్ లిటరేచర్ ఫౌండేషన్ విల్సన్, జొన్నలగడ్డ రామారావు, సదాశివరావు తదితరులున్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీపురం శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో బుధవారం శ్రేష్ఠ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని డాక్టర్ అఖిల్ రోహన్ లేళ్ళ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకాల శ్రాన్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మహత్య ధోరణుల నివారణ, ఒత్తిడిని అధిగమించడానికి మార్గాలు తెలియజేశారు. డాక్టర్ కీర్తి గన్నే మాట్లాడుతూ బాలికలలో రక్తహీనతను అధిగమించడానికి తీసుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి, హెచ్‌పీవీ వాక్సినేషన్ ప్రాముఖ్యం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ శ్రేష్ఠ హాస్పిటల్ యాజమాన్యం ఇటువంటి అవగాహన సదస్సు తమ పాఠశాలలో నిర్వహించటం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ డి.దుర్గాశ్యామ్, ప్రైమరీ కో ఆర్డినేటర్ దిల్‌జహాన్, ప్రీ ప్రైమరీ కో ఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇంచార్జి కె.హరిప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల యాజమాన్యంతో శ్రేష్ఠ హాస్పిటల్ వైద్యులు

అనుమతి ఉన్న వాటర్ కనెక్షన్ తొలగింపు

● కమిషనర్‌కు విశ్రాంత ఎస్ఐ ఫిర్యాదు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఓ ప్రైవేటు ఫిట్టర్ ఏకంగా అనుమతి ఉన్న మున్సిపల్ వాటర్ పైప్ కనెక్షన్ తొలగించి వేరొకరికి అక్రమంగా కనెక్షన్ ఇచ్చాడు. దీనిపై బాధిత విశ్రాంత ఎస్ఐ అప్పారావు కమిషనర్‌ను కలసి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బృందావన్ గార్డెన్స్‌లోని కోస్టల్ బ్యాంకు రోడ్డులో విశ్రాంత ఎస్ఐ అప్పారావు 11 సంవత్సరాలుగా ఉంటున్నాడు. అప్పట్లో ఆయన నగరపాలక సంస్థ అధికారుల నుంచి నీటి కొళాయి కనెక్షన్ పొందారు. అయితే రెండు రోజుల క్రితం గుర్తు తెలియని ఫిట్టర్ అప్పారావుకు చెందిన కనెక్షన్ తొలగించడమే కాకుండా దానికి అనధికారికంగా మరొకరికి కనెక్షన్ ఇచ్చారు. తాగునీరు రాకపోతుండటంతో అనుమానం వచ్చి అప్పారావు పరిశీలించగా ఆయన కనెక్షన్ తొలగించి ఉంది. ఈ విషయంపై ఫిట్టర్ శివను ప్రశ్నించగా పరిశీలిస్తానంటూ కాలయాపన చేస్తున్నాడు. దీంతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి సరైన సమాధానం రాలేదని, అంతేకాకుండా అక్కడ అనేక అనధికారిక నీటి కనెక్షన్‌లు ఉన్నాయని అప్పారావు కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఇంట్లోకి అక్రమంగా చొరబడి ఫ్యూజు తొలగింపుపై కేసు

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి అక్రమంగా చొరబడటమే కాకుండా విద్యుత్ సరఫరా నిలిపేసేందుకు ఫీజు తీసిన ఘటనపై అరండల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భారత్‌పేట ఒకటో లైన్‌లోని కృష్ణ చైతన్య అపార్టుమెంట్‌లో ఫ్లాట్ నెంబర్ 302కు సంబంధించి యాజమాన్య హక్కుల విషయంలో కాలేషావలి, కటారి రాజకుమార్ మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. అయితే ఆ ఫ్లాట్‌ను గతంలో కాలేషావలి జాన్‌బీ కుటుంబానికి అద్దెకి ఇచ్చాడు. అయితే ఫ్లాటు తనదంటూ రాజకుమార్ అందులో నివసిస్తున్న వారిని బెదిరించి వారి ఇంటికి వచ్చే పైపులైన్లను కట్ చేయడం, అదేవిధంగా ఇంటిలో ఫ్యూజులు పీకడం వంటివి చేస్తున్నారు. దీనిలో భాగంగా రాజ్‌కుమార్ మంగళవారం రాత్రి జాన్‌బీ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, విద్యుత్ ఫ్యూజులు తొలగించాడు. దీనిపై బుధవారం జాన్ బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగతో అదుపు తప్పిన ఆటో

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట సమీపంలోని నల్లపాడు రోడ్డులో ఓ ఆటో బుధవారం వాహనదారులను వణికించింది. నల్లపాడు నుంచి చుట్టుగుంట వైపునకు వెళుతున్న ట్రక్కు ఆటోలో సైలెన్సర్ నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించాయి. దాంతో ఆటుగా రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. పొగలతో పాటు ఆటో ఒక్కసారిగా ముందు చక్రాలు పైకి ఎగురుతూ అదుపు తప్పటంతో పక్కనే వెళుతున్న పాదచారులు, వాహనచోదకులు పరుగులు పెట్టారు. వెంటనే సమీపంలోని మెకానిక్ రావటంతో ఇంజన్ ఆపి ఆటోను అదుపు చేశాడు. రోడ్డులో పెద్దగా రద్దీ లేకపోవటంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఇంజన్‌లో సాంకేతిక లోపం రావటంతోనే పొగలు వ్యాపించాయని మెకానిక్ తెలిపాడు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

సీఎం చంద్రబాబుతోనే మహిళా సాధికారత

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని, స్త్రీశక్తి పథకం ద్వారా నారీమణుల ఆత్మగౌరవాన్ని పెంపొందించామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో నియోజకవర్గ స్త్రీశక్తి కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్ద పీట వేశారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు చెప్పింది చెప్పినట్టు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. స్త్రీశక్తి పథకం అమలు ద్వారా బస్సుల్లో ఉచిత ప్రయాణానికి నాంది పలికారని, దీని ద్వారా మహిళా లోకం చాలా సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థినులు, మహిళా ఉద్యోగులకు స్త్రీశక్తి పథకం ద్వారా ప్రతి నెలా రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. రాష్ట్రంలో మహిళాభ్యుదయానికి ఉచిత కుట్టుశిక్షణతోపాటు కుట్టుమిషన్ల పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా ఆయా కుటుంబాలకు మహిళలే ఆర్థిక దన్నుగా నిలుస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత పార్టీ కేడర్‌దేనని స్పష్టం చేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఆర్వీఆర్ జేసీ విద్యార్థుల ఎంపిక

గుంటూరు (విద్య) సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు చెన్నైకి చెందిన శ్రీ సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం నుంచి ముగ్గురు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి 9 మంది రూ.2.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారని చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందించారు.



విద్యార్థులతో కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ

సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పార్టీని బలోపేతం చేస్తూ, కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య అన్నారు. పవన్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా బుధవారం అమరావతి రోడ్డు, అన్నదాన సమాజం ఆడిటోరియంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న రోశయ్య ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు విలువలు, హుందాను పవన్‌కళ్యాణ్ తీసుకువచ్చారన్నారు. జనసేన నాయకుడు చందు సాంబశివరావు మాట్లాడుతూ సామాజిక సేవల్లో విస్తృతంగా పనిచేస్తున్న సేవాసేదన్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసదన్ వ్యవస్థాపకులు మిరియాల గోపీకుమార్, మిరియాల ప్రసాదరావు, డాక్టర్ జాన్సీ వీరాంజనేయులు, పొత్తూరి రంగారావు, బిల్లా అశోక్, షేక్ ఇస్మాయిల్, అబ్దుల్ ఖాదర్, బాలస్వామి, అన్నం రమేష్, బండి రామ్ ప్రభువు పాల్గొన్నారు.

ఎస్ఐ వైఖరిపై రుద్ర చారిటబుల్ ట్రస్ట్ నిరసన

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపులో నగరంపాలెం ఎస్ఐ రమాదేవి వ్యవహారం వివాదాస్పదమైంది. రుద్ర చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు సుభానిపై ఎస్ఐ అనుచితంగా ప్రవర్తించారంటూ ట్రస్టు సభ్యులు నగరంపాలెం స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో బుధవారం రాత్రి నగరంపాలెం స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రామిరెడ్డినగర్ నుంచి వస్తున్న ఊరేగింపు సుభాని హోటల్ సమీపంలో రాగా డీజే సౌండ్ విషయంపై ఎస్ఐకు, సభ్యులకు మధ్య వివాదం ముదిరింది. చివరకు ట్రస్టు సభ్యులు నగరంపాలెం స్టేషన్‌కు వచ్చి నిరసన తెలిపారు. చవితి ఉత్సవాలలో భాగంగా అన్ని అనుమతులు ఉన్నప్పటికీ, డీజే పెట్టకపోయినా ఎస్ఐ హెచ్చరిస్తూ కొట్టేంత పని చేశారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము సేవా కార్యక్రమాలు చేసే ట్రస్ట్ సభ్యులమని చెప్పినా.. నాకేమైనా సేవ చేశారా? సేవ చేయమని నేనేమైనా చెప్పానా? అని ఎస్ఐ తమ పట్ల అనుచితంగా వ్యవహరించారని వాపోయారు. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ నజీర్‌బేగ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ అళహరి శ్రీనివాస్ తదితరులు స్టేషన్ చేరుకుని సర్ది చెప్పారు. దీంతో వారు నిరసన విరమించి వెళ్లిపోయారు.




నగరంపాలెం పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రుద్ర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

నలుగురు సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఎం వెంకట సుబ్బారావు, కె వెంకటేశ్వర్లు, బెల్లం శ్రీనివాసరావు, సీహెచ్ చంద్రమౌళి తదితరులకు ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు.

యువత దేశభక్తి, క్రమశిక్షణను అలవర్చుకోవాలి

● సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్య శర్మ



డాక్టర్ శనక్కాయల అరుణ కుటుంబ సభ్యులతో సర్వేపల్లి రాధాకృష్ణన్ మునుమడు సుబ్రహ్మణ్యశర్మ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువత దేశభక్తి, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు జీ సుబ్రహ్మణ్య శర్మ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని డాక్టర్ శనక్కాయల అరుణ నివాసానికి సుబ్రహ్మణ్య శర్మ బుధవారం విచ్చేశారు. డాక్టర్ శనక్కాయల అరుణ, ఎస్‌జీఎస్ కృష్ణారావు, స్థానిక యువతతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఇండియా ఈజ్ యువర్ హార్ట్ అనే ప్రేరణాత్మక సందేశం అందించారు. దేశభక్తి, క్రమశిక్షణ, కృషితో యువత తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ కుటుంబ సభ్యులు, ఉదయశంకర్, కోడలు రాధా మాధవి, ఉమాశంకర్, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి అతిథి గృహం



గుంటూరు: హౌసింగ్ బోర్డు నుంచి అంకిరెడ్డి పాలెం వెళ్లే దారిలో ఉన్న శ్రీ విజేతా సేవా సమితి ఇల్లు

450 శవాలకు అక్కడి నుంచే అంతిమ యాత్ర

- రూపాయి ఖర్చు లేకుండా ఆవాసానికి ఏర్పాట్లు
- కర్మకాండలు చేసుకునే అవకాశం
- శ్రీ విజేతా సేవా సమితి ఆధ్వర్యంలో వినూత్న సేవ

ఆ మధ్య కాలంలో అటవీశాఖ రాష్ట్ర అధికారి ఒకరు హఠాత్తుగా మరణించారు. తాడేపల్లిలో ఆయన ఉండేది అద్దె ఇల్లు కావటంతో శవాన్ని అక్కడికి తీసుకురావద్దని ఇంటి యజమాని కరాఖండిగా చెప్పేశారు. దాంతో చేసేది లేక ఆయన భౌతిక కాయాన్ని కుటుంబసభ్యులు గుంటూరు అటవీశాఖ కార్యాలయం వద్ద ఉంచి అక్కడ నుంచే అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆయన ఉన్నత స్థాయి అధికారి కాబట్టి అలా కార్యాలయంలో నైనా అవకాశం కల్పించారు. అదే పేదలు, దిగువ మధ్య తరగతి వారు మరణిస్తే వారి సంగతి ఇక చెప్పనక్కరలేదు. అద్దె ఇంట్లో ఉంటున్నారు కాబట్టి శవాన్ని కచ్చితంగా రోడ్డు మీద ఉంచాల్సిందే. ఆ రోజే ఏ వానో, వరదో వస్తే వారి కుటుంబసభ్యుల బాధ వర్ణనాతీతం. తమ వారికి కనీసం గౌరవప్రదంగా అంతిమ యాత్ర నిర్వహించుకోలేక పోయామనే దిగులు వారిని జీవితాంతం వెంటాడుతుంది. ఇలా ఎన్నో భౌతిక కాయాలకు అంతిమ యాత్రలో చేదు అనుభూతి కలిగిన ఉదంతాలను కళ్లతో చూసిన తర్వాత ఆవిర్భవించిందే శ్రీ విజేత సేవా సమితి. ఇది గుంటూరు నగరంలోనే ఉంది. హౌసింగ్ బోర్డు నుంచి అంకిరెడ్డి పాలెం వెళ్లే దారిలో ఒక పెద్ద ఇంటిని ఈ సేవా సంస్థ కార్యకలాపాల కోసం నిర్మించారు. కుల, మతాలతో సంబంధం లేకుండా ఎవరైనా దాన్ని ఉచితంగా వాడుకోవచ్చు. ప్రాణం పోగానే భౌతిక కాయాన్ని అక్కడకు తీసుకువచ్చి అంతిమ యాత్ర నిర్వహించుకోవచ్చు.

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

2003లో ఆవిర్భవించిన శ్రీ విజేత సేవా సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గుంటూరు ఏటీ అగ్రహారంలోని శ్రీ విజేత హైస్కూల్ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి దాన్ని స్థాపించారు. కొన్ని వేల అనాధ శవాలకు ఈ సంస్థ ద్వారా అంతిమ సంస్కారాలు నిర్వ హించారు. 2020లో అంకిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డులో శ్రీ విజేత సేవా సంస్థ పేరుతో ఒక పెద్ద ఇంటిని నిర్మించారు. అప్పటి నుంచి ఇల్లు లేకుండా మరణించిన వారి భౌతిక కాయాన్ని ఇక్కడకు తీసుకువచ్చి అంతిమ సంస్కారం నిర్వహించుకునే విధంగా అవకాశం కల్పించారు. అక్కడకు తీసుకువచ్చే శవాల కోసం ప్రత్యేకంగా ఫ్రీజర్ బాక్స్‌లు కూడా అందుబాటులో ఉంచారు. అంతిమ యాత్ర సమయంలో వాడుకోవ టానికి స్వర్గ ధామం పేరుతో ఒక వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు. రూపాయి ఖర్చు లేకుండా స్మశాన వాటికకు తీసుకు వెళ్ళటానికి వీలుగా రవాణా సదుపాయం కల్పించారు. ఇప్పటి వరకు సుమారు 450కి పైగా శవాలను ఇక్కడకు తీసుకువచ్చి అంతిమ యాత్రలు నిర్వహించారు.

15 రోజుల వరకు ఉండే అవకాశం

మరణించిన వారి కుటుంబసభ్యులను 15 రోజుల వరకు కొంతమంది ఇళ్లలోకి రానివ్వరు. ఆ ఇబ్బందిని కూడా గమనించిన శ్రీ విజేత సేవా సంస్థ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి మరో ఏర్పాటు చేశారు. కేవలం అంతిమ యాత్ర నిర్వహించు కోవటం మాత్రమే కాకుండా మరణించిన వారి కుటుంబ సభ్యులు 15 రోజుల పాటు ఇక్కడే ఉండే సౌలభ్యం కల్పిం చారు. అవసరమయితే పెద్ద కర్మ రోజున బంధువులకు భోజనాలు పెట్టుకోవటానికి కూడా ఏర్పాట్లు చేశారు.

ప్రతి శనివారం పిడికిలి బియ్యం

శ్రీ విజేత సేవా సంస్థ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి నగరంలోని ఏటీ అగ్రహారం రెండో లైన్‌లో హైస్కూల్ ఏర్పాటు చేశారు. అక్కడ విద్యనభ్యసించే విద్యార్థులు ప్రతి శనివారం ఒక పిడికెడు బియ్యం తీసుకురావాలని చెబు తారు. వాటితో భోజనం తయారు చేసి వారానికి ఒకసారి గుంటూరు ప్రభుత్వాసు పత్రి వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహి స్తారు. విద్యార్థులకు ఆహారం విలువ తెలియ జేయడానికి ఈ కార్యక్రమాన్ని తాము నిర్వ హిస్తున్నట్లు చెరుకూరి శ్రీహరి తెలి పారు.

ఎన్నో ఉదంతాలు చూసిన తర్వాత...



అద్దె ఇంట్లో మరణిస్తే శవాన్ని ఇంట్లోకి రానివ్వరు. ఇటువంటి ఉదంతాలు నేను చాలా చూశాను. మనిషి జీవించినంత కాలం ఎంతో గౌరవంగా బతుకుతారు. వాళ్లు మరణించిన తర్వాత కూడా అదే గౌరవంతో అంతిమ యాత్రకు అవకాశం కల్పించాలన్న ఆలోచనతోనే ఈ ఇంటిని ఏర్పాటు చేశాము. ఎంతో మంది దీన్ని ఉచితంగానే వాడుకుంటారు. స్తోమత కలిగిన వాళ్లు అయితే విద్యుత్ బిల్లు ఇస్తారు. అదీ లేకుంటే ఉచితంగానే అన్ని చేసుకునే అవకాశం ఉంది.

-శ్రీ విజేత సేవా సంస్థ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి, గుంటూరు

గంటల తరబడి.. వెయిటింగ్



- తెనాలి రైల్వేస్టేషన్ హోంలో సాంకేతిక సమస్యలు
- గుంటూరు, రేపల్లె వైపు నుంచి వచ్చే రైళ్లకు రెడ్ సిగ్నల్
- గమ్యస్థానాలకు చేరుకోవడంలో జాప్యం

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - గూడూరు మూడో రైలు మార్గం నిర్మాణంలో భాగంగా తెనాలి రైల్వేస్టేషన్ యార్డులో జరిగిన పనులు సక్రమంగా పూర్తి కాలేదు. దీంతో నిత్యం ఏదో ఒక సాంకేతిక సమస్య రైల్వేస్టేషన్ హోంలో తలెత్తుతోంది. ఈ కారణంగా గుంటూరు నుంచి తెనాలి మీదగా తిరుపతి, చెన్నై సెంట్రల్ వైపునకు వెళ్లే రైళ్లకు క్లియరెన్స్ లభించడం లేదు. అలానే రేపల్లె నుంచి వచ్చే రైళ్లకు కూడా గ్రీన్‌సిగ్నల్ రాకపోతుండటంతో ఇంచుమించు గంటపాటు హోంలో ఆయా రైళ్లను నిలిపేయాల్సి వస్తోంది. ఆ తర్వాత క్లియరెన్స్ ఇచ్చి పంపినా సమయపాలన నష్టం జరిగిన కారణంగా గమ్యస్థానాలకు గంట నుంచి రెండు గంటల ఆలస్యంగా చేరుతున్నాయి. చెన్నై, నారాయణాద్రి, డెల్టా, శబరి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ సమస్య తలెత్తుతోంది. లాగ్‌బుక్‌లో రోజుకో కారణాన్ని తెనాలి రైల్వేస్టేషన్ అధికారులు పొందుపరుస్తోండటంతో హోంలో సమస్య తలెత్తడానికి అసలు కారణం ఏమిటనేది అంతుచిక్కకుండా ఉన్నది.

సికింద్రాబాద్ వైపు నుంచి గుంటూరుకు రైళ్లు సకాలంలో చేరుకుంటున్నాయి. గుంటూరు నుంచి తెనాలికి గరిష్ఠంగా 20 నిమిషాల వ్యవధిలోనే చేరుకోవచ్చు. అయినప్పటికీ మధ్యలో ఎక్కడైనా సమయపాలన దెబ్బతింటే దానిని భర్తీ చేసేందుకు కొన్ని రైళ్లకు ఎక్కువ ప్రయాణ సమయాన్ని కేటాయించారు. ఇప్పుడు అది కూడా చాలడం లేదు. గత కొన్ని రోజుల నుంచి చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లు తెనాలి రైల్వేస్టేషన్ హోంకు చేరుకొని గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నాయి. దీనివలన గుంటూరు నుంచి తెనాలికి ప్రయాణ సమయం గం టన్నరకు పైగా పడుతున్నది. గత రాత్రి అయితే గుంటూరు నుంచి రాత్రి 10.19కి బయలుదేరిన చెన్నై ఎక్స్‌ప్రెస్ తెనాలి చేరుకొనేసరికి 11.50 అయింది. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ గుంటూరులో రాత్రి 10.59కి బయలుదేరితే తెనాలికి అర్ధరాత్రి దాటాక 12.27కి చేరింది. దీనివలన రెండు గంటల 13 నిమిషాల ఆలస్యంగా తిరుపతి చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. డెల్టా ఎక్స్‌ప్రెస్ కూడా రేపల్లె నుంచి వచ్చే టప్పుడు తెనాలి హోంలో నిలిపేస్తున్నారు.

ఇరువైపులా క్యాబిన్‌లు తీసేయడం వలనేనా...

గతంలో తెనాలి రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా క్యాబిన్‌లు ఉండేవి. వాటిల్లో జూనియర్ స్టేషన్ మాస్టర్లు ఉండేవారు. డిప్యూటీ స్టేషన్ మాస్టరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై ఉండి క్యాబిన్‌లో ఉండే జూనియర్లకు హాట్‌లైన్ కమ్యూనికేషన్ పరికరాల ద్వారా మార్గదర్శకం చేసేవారు. దాంతో ఎలాంటి సమస్యలు తలెత్తేవి కావు. ఇప్పుడు మూడో రైలు మార్గం నిర్మాణంలో భాగంగా క్యాబిన్‌లు పూర్తిగా తొలగించారు. దాంతో అంతా స్టేషన్‌లోనే కేంద్రీకృతమౌతున్నది. సీనియర్ మాస్టర్లు కేవలం కాషన్ ఆర్డర్ల జారీకి పరిమితం అవుతున్నారు. దీంతో జూనియర్‌లు సక్రమంగా హ్యాండ్లింగ్ చేయలేక హోంలో రైళ్లను నిలిపేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

పల్లెలకు పైసలొచ్చాయ్..!

(5వ పేజీ తరువాయి)

మరమ్మత్తులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులకు ఈ నిధులను ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

నిధులు విడుదలతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం

ఎనిమిది నెలల తర్వాత నిధులు విడుదల కావడంతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిధుల విడుదలతో గ్రామాల్లో సమస్యలు తీరే అవకాశం ఏర్పడిందని పేర్కొంటున్నాయి. ఈ నిధులతో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నాయి. కాగా, పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సం క్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పంచాయ తీలను బలోపేతం చేస్తోందన్నారు. నిధులు విడుదల చేయడం పట్ల అయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బార్లు బాధలు

(5వ పేజీ తరువాయి)

దృష్టి పెట్టారు. దరఖాస్తు చేయడానికి వారికున్న సాదకబాధకాలు పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. ముందు బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయాలని కోరుతున్నారు.

నేతల వద్దకు క్యూ..

బార్ల దరఖాస్తుల అంశాన్ని ఉన్నతాధికారులు అత్యంత ప్రయారిటీగా తీసుకోవడం ఒక ఎత్తయితే, స్పందన లేకపోతే పోస్టింగే ప్రమాదంలో పడే అవకాశాలు ఉండడంతో ఎక్సైజ్ అధికారులు ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లో కీలకంగా ఉండే అధికార పార్టీ నేతల వద్దకు వెళ్లి ఎలాగైనా బార్లకు దరఖాస్తులు పడేలా చూడాలని కోరుతున్నారు. స్థానికంగా ఉన్న ఆశావహులకు నేతలతో ఫోన్లు చేయిస్తు న్నారు. ఇప్పటికే మద్యం షాపులు నిర్వహిస్తున్న వారిని, ఆర్థికంగా బలంగా ఉండి గతంలో ఈ రంగంలో ఉన్నవారిని కలిసి దరఖాస్తులు వేయించేలా అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

వ్యాపారం చేయలేం..

ఇప్పటికే మద్యం షాపుల విషయంలోనే పడుతూ లేస్తూ వ్యాపారం చేస్తున్నామని కొత్తగా బార్ల భారాన్ని మోయలేమని వ్యాపారులు తెగేసి చెబుతున్నట్లు తెలుస్తోంది. పాలక పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయిలో ఉండే ఎక్సైజ్ సిబ్బందికి ఇలా ప్రతి ఒక్కరికీ ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని, ఇవన్నీ బేరీజు వేసుకుని వ్యాపారం చేసేకన్నా మిన్నకుండడమే మేలనే అభిప్రాయాన్ని ఆశావహులు వ్యక్తం చేస్తున్నారు. బార్ల విషయంలో ప్రభుత్వం లైసెన్స్ ఫీజు విషయంలో పునరాలోచన చేస్తుందని అనుకున్నాం కానీ ఇలా అధికారులను తమపైకి పంపి ఒత్తిడి పెడుతుందనుకోలేదని వ్యాపారులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 8 మందికి...

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



డాక్టర్ జే ప్రతాప్



పీ సునీత రాణి



గుమ్మడి సునీలా మాధవి



అవ్వారు భద్రావతి

గుంటూరు(విద్య), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీన రాష్ట్రస్థాయిలో అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఉమ్మడి జిల్లా నుంచి ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. బాపట్ల జిల్లా తుమ్మలపాలెం జడ్పీహెచ్‌ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ జే ప్రతాప్, అద్దంకి ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం ధనలక్ష్మి, పల్నాడు జిల్లా నకరికల్లు జడ్పీహెచ్‌ఎస్ తెలుగు ఉపాధ్యాయురాలు శివకుమారి, పల్నాడు జిల్లా బీ.పురం జడ్పీహెచ్‌ఎస్ గ్రేడ్ 2 హెచ్‌ఎం ఎం పార్వతి, గుంటూరు జిల్లా కనపర్రు ఎంపీయూపీ బీపీఆర్ పాఠశాల ఉపాధ్యాయురాలు వై రాజ్యలక్ష్మి, గుంటూరు ఎస్‌ఎస్‌ఎన్‌ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పీ సునీత రాణి, గుంటూరు పట్టాభిపురం మున్సిపల్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గుమ్మడి సునీల మాధవి, గుంటూరు జిల్లా చీలిపాలెం మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు డాక్టర్ అవ్వారు భద్రావతి రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో వీరికి అవార్డులు అందజేయనున్నారు.

తగ్గిన నిమ్మ ధర

- గతంలో బస్తా 5 వేలు పైచిలుకు
- ఇప్పుడు బస్తా రూ.1700
- ఆనందం వ్యక్తం చేసిన వీధి వ్యాపారులు



పిడుగురాళ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆకాశాన్నంటేలా ఉన్న నిమ్మకాయ ధరలు ఇప్పుడు తగ్గాయి. ఒక్కప్పుడు రూ.4.500 నుంచి రూ.6 వేల వరకు ధర పలికిన 50 కేజీల నిమ్మకాయల బస్తా.. ఇప్పుడు సగానికిపైగా తగ్గింది. మొన్నటివరకు బెల్లంకొండ, పెదకూరపాడు, అచ్చంపేట, కారంపూడి, దాచేపల్లి, రాజుపాలెం మండలాల రైతులు పండించిన నిమ్మకాయలను మధ్యవర్తులు కొని అధిక ధరలకు వాటిని వ్యాపారులకు విక్రయించేవారు. అయితే గత నెలలో కురిసిన అధిక వర్షాలకు పల్నాడు ప్రాంతంలోని నిమ్మతోటల్లో కాయలు రాలిపోవడం, కొత్త కాపు రాకపోవడంతో ప్రకాశం జిల్లా కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల నుంచి రైతులు పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి ప్రాంతాలకు చేరుకొని నేరుగా వీధి వ్యాపారులకు 50 కేజీల బస్తా రూ.1500లకు విక్రయిస్తున్నారు. పల్నాడు ప్రాంతంలో పండిన నిమ్మకాయల సైజు, నాణ్యతకు రెండింతల సైజులో మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల నుంచి నిమ్మకాయలు పట్టణ ప్రాంతాలకు చేరవేస్తుండటంతో వ్యాపారులు ఎగిరి గంతేస్తున్నారు. నిమ్మకాయల ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు అమ్మాలంటే ఎంతో ఇబ్బందిగా ఉండేదని, కొనుగోలుదారులు అడిగే సవా లక్ష ప్రశ్నలకు ఎంత ఓపికగా సమాధానం చెప్పినా కొనుగోలు అంతగా ఉండేవి కాదని లక్ష్మయ్య అనే వ్యాపారి చెప్పారు. ఇప్పుడు ధర తగ్గడంతో అమ్మకాలకు ఇబ్బంది లేకుండా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

విద్యార్థులు చదువుతో పాటు

క్రీడల్లోనూ రాణించాలి

మా రోజుల్లో మైదానాలు లేవు ఇప్పుడు మెండుగా సౌకర్యాలు

మహిళా శిశు సంక్షేమ మంత్రి సంధ్యారాణి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూట్ అమరావతి ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల రాష్ట్రస్థాయి నాలుగో లెవెల్ క్రీడా పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ గిరిజన మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి జీ సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా ర్థులు పాఠ్యాంశాలనే కాకుండా క్రీడలనూ తమ జీవితాల్లో భాగం చేసుకో వాలని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించి వారిని జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే విధంగా అధికా రులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాము ఆడుకునే రోజుల్లో మైదానాలు ఉండేవి కావని, ఇప్పుడు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదల కోసం ప్రభుత్వ వసతి గృహాల్లో రాష్ట్ర ప్రభుత్వం మంచి పౌష్టికాహారం అందిస్తు న్నట్లు మంత్రి చెప్పారు. భాషా పాఠ్యాంశాలపై ఇబ్బందులు కలుగుతున్నా యని విద్యార్థుల నుంచి తరచూ తమకు ఫోన్లు వస్తున్నాయని, వాటిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠ శాలల్లో తెలుగు, ఆంగ్లం, హిందీలలో అవగాహన కలిగిన అధ్యాపకులను నియమిస్తామని సంధ్యారాణి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ వైస్ చైర్మన్ యం మల్లికార్జున నాయక్, డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ సదా భార్గవి, వ్యాయమ కళాశాల ప్రిన్సిపాల్ పీపీఎస్ పాల్ కుమార్, స్పోర్ట్స్ కన్వీనర్ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో..

కేఎల్‌యూలో మాదక ద్రవ్యాల వ్యతిరేక సదస్సులో ఈగల్ ఐజీ రవికృష్ణ

తాడేపల్లి (వడ్డేశ్వరం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల మహమ్మారి నుంచి తమ బిడ్డలను కాపాడుకునేందుకు ప్రతి తల్లీ ఒక అంబాసిడర్ కావాలని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బుధవారం కేఎల్ ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా కేఎల్‌యూలో కూడా నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులను ఈగల్ కార్యక్రమాలలో భాగస్వామ్యులను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎవరైనా మాదక ద్రవ్యాల బారిన పడితే టోల్ ఫ్రీ నెం.1972కు గానీ వాట్సాప్ నెం.8977781972కు గానీ తెలియజేస్తే బాధితులను ఆ బారి నుంచి కాపాడతామని ఐజీ రవికృష్ణ హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీ ఏటీవి రవికుమార్ మాట్లాడుతూ, గంజాయి కేసుల్లో అరెస్టయిన వారు జీవితాంతం నేరస్థులుగా మిగిలిపోతారని అన్నారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ వీసీ సారధివర్మ, ప్రో. వీసీలు డాక్టర్ ఎవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకటరామ్, డాక్టర్ కె రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కెఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఉమెన్ డెలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె రూత్ రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణను సత్కరిస్తున్న కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు, డీన్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు

సీనియర్స్ విభాగంలో వేటపాలెం ఎడ్ల సత్తా

- ప్రత్తిపాడులో ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు
- జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా ఎడ్లు ముందంజ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో వారం రోజులుగా జరుగుతున్న నందమూరి తారక రామారావు మెమోరియల్ రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 190 వరకు ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 4,142.2 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలవగా, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట మండలం, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్ రెడ్డి, సుంకి సాకేత్ రెడ్డికి చెందిన ఎడ్ల జత 4,014.10 అడుగుల దూరం బంగను లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ యాదవ్‌కు చెందిన ఎడ్ల జత 3,649.10 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలిచింది.

జూనియర్స్ విభాగంలో..

జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత 3,300 అడుగుల దూరం బండనులాగి ప్రథమ స్థానంలో నిలవగా, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్ల జత 3000 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ ప్రగతి రిసార్ట్స్‌కు చెందిన మేక ప్రదీప్‌కు చెందిన ఎడ్ల జత 2,940.10 అడుగుల దూరం బండనులాగి తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలైన ఎడ్ల యజమానులకు ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, నసీర్ అహమ్మద్‌తో పాటు గల్లా రామచంద్రరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, వెలివెల్లి సుబ్బారావు, కాసు పెంటారెడ్డి, చిన్నం శ్రీకాంత్, పమిడి అంజియ్యా చౌదరి అన్ని గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గల్లా మాధవి

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇబ్రహీం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంగళగిరికి చెందిన మహమ్మద్ ఇబ్రహీం నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం 11 కార్పొరేషన్లకు బోర్డు డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టరుగా ఇబ్రహీం చోటు దక్కించుకున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇబ్రహీం పార్టీ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేశారు. ప్రస్తుతం ఆయన మంగళగిరి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఉన్నారు. మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఇబ్రహీంకు పలువురు కూటమి నేతలు అభినందనలు తెలియజేశారు.

ఇంటి పట్టాలు అందజేయడం హర్షం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు అందించేందుకు జీవో నెం 30ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. రూరల్ మండలం ఓబులనాయుడు పాలెం, నాయుడుపేట, సీఆర్ నగర్లో జరిగిన ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేవలం రూ.50 లబ్ధిదారుల ఖాతా నుంచి రెవెన్యూ శాఖకు చెల్లించి దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. అధికారులకు, దళారులకు, ప్రజా ప్రతినిధులుకు ఎటువంటి డబ్బులు చెల్లించవద్దని సూచించారు.

11న అమృతలో గ్రాడ్యుయేషన్ డే

మంగళగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కురగల్లు గ్రామంలోని అమృత విశ్వ విద్యాపీఠంలో ఈ నెల 11వ తేదీన ప్రథమ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరుగుతాయని విద్యాపీఠం ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఆర్టీజీఎస్, సమాచార, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ గౌరవ అతిథిగా హాజరవుతారని వారు చెప్పారు. మాతా అమృతానందమయి మఠం ప్రధాన కార్యదర్శి స్వామి పూర్ణామృతానందం పురి అధ్యక్షతన జరిగే ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో గ్రాడ్యుయేట్లకు సర్టిఫికెట్లు, మెడల్స్ అతిథులు ప్రదానం చేస్తారని తెలిపారు.

ఓడీఎఫ్ ధ్రువీకరణకు సన్నాహాలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నగరాన్ని బహిరంగ మల విసర్జన రహిత ప్రాంతంగా ప్రకటించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా తెలిపారు. ఈ మేరకు ఎంటీఎంసీ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. విస్తృత సర్వే ఆధారంగా పట్టణాన్ని తాత్కాలిక ఓడీఎఫ్‌గా గుర్తించినట్టు చెప్పారు. ఈ స్థితిని శాశ్వతంగా ధ్రువీకరించేందుకు ప్రజల సూచనలు, పరిశీలనలు కీలకమని అభిప్రాయపడ్డారు. దీని కోసం ఈ నెల 14వ తేదీ వరకు గడువు నిర్ణయించామని, ఎక్కడైనా బహిరంగ మల విసర్జన జరిగిన ఘటనలు గమనించినా, ఏవైనా అభ్యంతరాలు ఉన్నా 08645-295192 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. ప్రత్తిపాడు పోలీసుల వివరాల ప్రకారం, పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన కొలసాని శ్రీనివాసరావు (35) గుంటూరు నుంచి తన స్వగ్రామానికి వెళుతూ తిక్కిరెడ్డిపాలెం వద్ద ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుండి వేగంగా ఢీ కొన్నాడు. దీంతో తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు ఎస్ఐ నరహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి..

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామం వద్ద రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని, అతని చొక్కాపై వీనస్ టైలర్, లంబాడీ పేట, విజయవాడ అని ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 7207076614, 9440627554 నెంబర్లలో తెనాలి జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ..

తాడికొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ మండలం లాం గ్రామానికి చెందిన జిలాని(31) గత నెల 30 తేదీ ఉదయం రోడ్డు మీద నడుస్తూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కూరగాయాల లోడ్ వేసుకొని ఆటో డ్రైవర్ గుంటూరు నుంచి అమరావతి వైపు వెళ్తుండగా నడుచుకుంటు వెళ్తున్న జిలానిని ఢీ కొట్టాడు. ఆటో ఢీ కొట్టడంతో కింతపడిపోయిన జిలానికి తలకు, నడుము, పక్కటెములకు తీవ్రగాయాలతో రక్తస్రావం జరిగింది. సంఘటన స్థలం ఉన్న స్థానికులు భార్య, కుటుంబసభ్యులకు సమాచారం అందించటంతో జిలానీని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న జిలాని మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య షేక్ తస్లీమ్ తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జోజి తెలిపారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

16 బాటిళ్లు స్వాధీనం - ఒకరి అరెస్టు

తుళ్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెంకటపాలెంలో ఓ బడ్డీ కొట్టులో మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అన్నూరి ఏసుపాదం కొంతకాలంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నారు. తుళ్లూరు ఎస్ఐ కొండలు ఆ బడ్డీ కొట్టుపై దాడి చేసి 180 ఎంఎల్ కలిగిన 16 మద్యం క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నృసింహాలయంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం ఉదయం అగ్నిమథనం, పంచగవ్యారాధన, పంచగవ్య ప్రాశన, పంచాగ్ని ప్రణయనము, ఉక్తహోమాలు, పవిత్రములతో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిత్యహోమం, దిక్పూక్త హోమం, నవగ్రహ హోమం, ప్రసాద గోష్టి, న్యాసము, రాత్రి పవిత్రముల శయనాధి వాసము జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను తిలకించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కే.సునీల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయ ముఖమండపంలో అగ్ని మథనం చేస్తున్న అర్చకులు



లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

దేవుడి మాన్యంలో లక్ష్మీ గణపతి హోమం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ బాల గణపతి భక్త బృందం ఆధ్వర్యంలో మంగళగిరి దేవుడి మాన్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల నడుమ అర్చకులు హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, గురువారం రాత్రి భక్తులకు అన్న సంతర్పణ, శనివారం లడ్డూ వేలంపాట, స్వామివారి గ్రామోత్సవం జరుగుతాయని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తిరువీధుల ఆదిశేషు, ఊకోటి సత్యనారాయణ, సింగర శ్రీకాంత్, కర్ణ మహేష్, గంజి హరీష్, వంగర నాగేంద్ర, చప్పటి శంకర్, శ్రీహర్ష, వంగర నాగేశ్వరరావు, గంజి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే బూర్ల

● కోలాహలంగా పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం
● 200 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ



బాధ్యతలు స్వీకరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ బత్తిని వేణు



భారీ ర్యాలీగా తరలివస్తున్న వాహనాలు

పెదనందిపాడు,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : పీఏసీఎస్ అభివృద్ధిలో పాలకవర్గ సభ్యులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. పెదనందిపాడులో బుధవారం పెదనందిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పీఏసీఎస్‌లను నీరుగార్చిందని, బినామీ పేర్లతో రుణాలు ఇచ్చి నేతల జేబులు నింపుకొన్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదంటూ వైసీపీ కరపత్రికల్లో రాస్తున్నారని, వైసీపీ పాలనలో రైతులను మోసం చేసి నేడు సిగ్గులేకుండా ప్రభుత్వంపై తప్పుడు రాతలు రాయడమేమిటంటూ మండిపడ్డారు. గత ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తే వాటి బకాయిలు చెల్లించింది కూటమి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవతో పాటు పలు పథకాలతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుస్తున్నామని, దేశంలోనే అత్యధిక పింఛన్లు అందజేస్తున్న ఘనత కూటమికే దక్కుతుందన్నారు. ఎరువులు సకాలంలో అందిస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణకు త్వరలో పార్టీ అధిష్టానం న్యాయం చేస్తుందని తెలిపారు. తొలుత వరగాని చెక్‌పోస్టు వద్ద నుంచి 200ల ట్రాక్టర్లతో భారీ ర్యాలీగా పెదనందిపాడు సొసైటీ కార్యాలయానికి చేరుకుని పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, నాగులపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం సోమేశ్వర స్వామి కల్యాణమండపంలో ఎమ్మెల్యే రామాంజనేయులు చైర్‌పర్సన్ బత్తిని వేణగోపాలకృష్ణ(బుజ్జి), పర్సన్స్ నల్లూరి వెంకటేశ్వర్లు, కాండ్రు సత్యవతిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, పార్లమెంట్ తెలుగు రైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ చాగంటి సత్యహర్ష, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కమ్మ నాగమల్లేశ్వరరావు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు వెలగా గంగాధర్, జనసేన అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, మండల సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు విక్రయాల సుబ్బారావు, కాకుమాను, రేటూరు పీఏసీఎస్ చైర్మన్లు నల్లమోతు శంకరరావు, చుండూరు శ్రీనివాసబాబు, పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు, సీఈవో కొండెపాటి భాస్కరరావు, బీసీ నాయకులు అద్దంకి శివన్నారాయణ, పెంట్యాల శ్రీధర్, చెన్నుపాటి శివనాగేశ్వరరావు, నూతి మదన్, పత్తిపాటి రవీంద్ర, దొప్పలపూడి కోటేశ్వరరావు, పోహూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ లబ్ధిదారులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

● అగ్రిస్టాక్ సెంట్రల్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ క్వాలిటీ మేనేజర్ సరితా లక్ష్మి

తాడేపల్లి (చిర్రావూరు), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ లబ్ధిదారులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని అగ్రిస్టాక్ సెంట్రల్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ సీనియర్ క్వాలిటీ మేనేజర్ సరితా లక్ష్మి, సీనియర్ టెక్నికల్ డైరెక్టర్ ఎన్ఐసీ ఎన్ఆర్ సంద్రం అన్నారు. బుధవారం మండలంలోని చిర్రావూరులో రైతులతో జరిగిన ముఖాముఖి అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ రైతు విశిష్ట గుర్తింపు కార్డు సంఖ్యను కౌలు రైతులకు కూడా నమోదు చేయించడానికి విధి విధానాల రూపకల్పనలో భాగంగా సొంత రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేసే విధానం, కౌలు రైతు జారీ చేయు విధానాన్ని వివరించారు. ఇందుకు జతపరచవలసిన ముఖ్య పత్రాలు, యజమాని అంగీకార పత్రం తదితర విషయాలను కౌలు రైతులు, భూ యజమానులతో చర్చించారు. కార్యక్రమంలో జేడీఏ బాల సుబ్రహ్మణ్యం, పద్మావతి, ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, కార్తీక్, ఏవో నరేష్, మంగళగిరి సబ్ డివి జన్ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, తాడేపల్లి మండల వ్యవసాయాధి కారి శిరీష, ఏఈవోలు, వీఏఈలు రైతులు పాల్గొన్నారు.

సకల శుభాలు కలగాలని లక్ష్మీగణపతి హోమం

తుళ్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సకల శుభాలు కలగాలని, అమరావతి రాజధాని వేగంగా అభివృద్ధి చెందాలని బుధవారం తుళ్లూరు లైబ్రరీ సెంటర్లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. హోమ కార్యక్రమంలో ఉపవాసాలతో దంపతులు పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణలతో రుత్వికులు హోమ క్రతువును నిర్వహించారు. భక్తులు హోమంలో ద్రవ్యాలు వేసి పూర్ణాహుతి సమర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వమించారు.



హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

లైబ్రరీ సెంటర్లో..

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి గీతా లైబ్రరీ సెంటర్‌లో నెలకొల్పిన విఘ్నేశ్వరుని దర్శించుకొని, పూజలు చేశారు. రాజధాని అమరావతి అభివృద్ధికి ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి కావాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్టు ఈ సందర్భంగా బ్రహ్మం చౌదరి తెలిపారు. ఆయనతో పాటు స్థానిక టీడీపీ నాయకులు నెలకుదటి చందు, జమ్ముల అనిల్, తెలుగుయువత సభ్యులున్నారు.

మూడు వార్డులలో డస్ట్‌బిన్‌ల పంపిణీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఇంటింటి చెత్త సేకరణకు సంబంధించి స్వచ్ఛ వార్డులను తీర్చి దిద్దేందుకు మూడు వార్డులను ఎంపిక చేసి డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఐటీసీ, ఫినిష్ సొసైటీ సౌజన్యంతో ప్రతి ఇంటికి తడి పొడి చెత్తను వేసేందుకు డస్ట్ బీన్‌లతో పాటు కరపత్రాలను పంపిణీ కార్యక్రమం డీఎల్‌పీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. ఇందుకోసం పంచాయతీ పరిధిలోని 10,11,12 వార్డులను ఎంపిక చేసి ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు డబ్బూరి ఏడుకొండలు, కాకాని సురేష్, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, ఐటీసీ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డొంక రోడ్డు

తాడేపల్లి (చిర్రావూరు), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో రైతులు పంటపొలాలకు వెళ్లే డొంక రోడ్డు అధ్వానంగా మారడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డంతా గుంతలు, బురదమయంగా తయారైంది. నడిచి వెళ్లే రైతులు బురద మార్గంలో గుంతల్లో పడి లేస్తూ, పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. వాహనాలు దిగబడిపోతున్నాయి. సుమారు రెండు కిలోమీటర్లు ఉండే ఈ డొంక రోడ్డు వర్షాకాలంలో మరింత అధ్వానంగా తయారవుతోంది. ఇక్కడ నుంచే పొలాలకు ఎరువుల తోలకం, బండ్లు అరకలు, ట్రాక్టర్లు వెళ్లి వస్తు, పంట ఉత్పత్తులను తీసుకొస్తుంటాయి. కూలీలు పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిర్రావూరులో అధ్వానంగా ఉన్న డొంక రోడ్డు

పేద విద్యార్థులకు చేయూత

పెదనందిపాడు,సెప్టెంబరు, 3(ఆంధ్రజ్యోతి) : గ్రామంలో పలు అభివృద్ధి పనులకు, పేద విద్యార్థులను ఆదుకునేందుకు చెన్నుపాటి డెవలపర్స్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక సోమేశ్వరస్వామి కాలక్షేప మండపంలో బుధవారం పేద విద్యార్థులకు దాత చెన్నుపాటి శివనాగేశ్వరరావు అందించిన ఉపకార వేతనాలు నగదు చెక్కులను వరగాని గ్రామానికి చెందిన అద్దంకి లోకేష్, దీపిక, దొప్పలపూడి అలేఖ్య, అమేష్‌బాబు, వెంకటస్వప్న, రాధికలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి శివనాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ బత్తిని వేణు, బండారు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల ఎస్టీవోపై చర్యలు తీసుకోవాలి

● ఫ్యాప్టో నాయకుల వినతి

దుగ్గిరాల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా వేతనాలు సకాలంలో అందించకుండా, హెచ్ఆర్ఏ బిల్లులను నిలిపివేస్తూ అసంబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటున్న దుగ్గిరాల సబ్ ట్రెజరీ అధికారిపై చర్యలకై ఉన్నతాధికారులకు నివేదించాలని కోరుతూ ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాలు) నాయకులు దుగ్గిరాల తహసీల్దార్ సునీతకు వినతిపత్రం బుధవారం సాయంత్రం అందించారు. దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లోని చింతలపూడి, సిరిపురం, చక్రయపాలెం గ్రామాల్లో పనిచేసే సచివాలయ, రెవెన్యూ, ఉపాధ్యాయులకు సుమారు 20మంది వరకూ రికవరీ నోటీసులు జారీచేసి, మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో ఫ్యాప్టో నాయకులు బీ. బ్రహ్మయ్య, ఉన్నం ప్రసాద్, రవీంద్ర, దేవకుమార్, భాస్కర్, చలపతిరావు, కరీముల్లా, ఆర్వీప్రసాద్, కామాక్షి ఉన్నారు.

విద్యార్థుల మానసిక స్థితిని బట్టి బోధన ఉండాలి

దుగ్గిరాల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మానసిక స్థితిని బట్టి వారిలో విద్యపై ఆసక్తి కల్పించేందుకు ప్రయత్నించవచ్చునని జిల్లా సర్వశిక్షా అభియాన్ కౌన్సిలర్ పోలు రవికుమార్ అన్నారు. దుగ్గిరాలలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జిల్లా సర్వశిక్షాఅభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశా పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి యూపీహెచ్‌సీ పరిధిలోని ఉండవల్లి, మహానాడు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఆశా వర్కర్స్ యూనియన్ తాడేపల్లి మండల గౌరవాధ్యక్షుడు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి పీహెచ్‌సీలో ఆశా వర్కర్ల గ్రూపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలిండియా సీఐటీయూ మహాసభలు విశాఖపట్నంలో జరగబోతున్నాయని, ఆ మహాసభల జయప్రదానికి ఆశా కార్యకర్తలందరూ తమ వంతు ఆర్థిక సాయం అందించి మహాసభ జయప్రదానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అనంతరం తాడేపల్లి పీహెచ్‌సీ యూనియన్ అధ్యక్షురాలిగా విశాలి, కార్యదర్శిగా చంద్రకళ మరో ఐదుగురిని కమిటి సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేముల రేణుక, తదితరులు పాల్గొని పీహెచ్‌సీ వైద్యురాలు శాంతికి వినతిపత్రం అందించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్ తెలిపారు. రూరల్ మండలం పరిధిలోని పెదపలకలూరు, చిన పలకలూరు గ్రామాల పాఠశాలల్లో ఫ్లోరోసిస్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. కలుషిత నీరు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. జంక్ ఫుడ్‌తో ఊబకాయం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కలుషిత నీరు తాగితే ఫ్లోరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, స్వచ్ఛమైన నీరు, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ కల్పనారాణి, ఆశా వర్కర్లు అనూష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల సంక్షేమంపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుందని, ఏపీలో కూటమి ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన బీసీల రక్షణ చట్టం ఏమైందని ప్రశ్నించారు. తక్షణమే కుల గణన చేపట్టి బీసీల రక్షణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేశ్, నేతలు తిరువీధుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి అయితా నాగేశ్వరరావు



పొలం పిలుస్తోందిలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, రైతులు

తాడికొండ(కంతేరు), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 5500 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం తాడికొండ మండలం కంతేరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ఈనెల 6వ తేదీ నుంచి 10 తేదీ వరకు జిల్లాకు సుమారు 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుతం పత్తి పంట పూత దశలో ఉన్నదని, గులాబీ రంగు కాయ తొలుచు పురుగు ఉధృతి పెరుగుందని తెలిపారు. పత్తి పంటలో లింగాకర్షక బుట్టలు ఎకరాని 10 చొప్పున పెట్టుకొని గులాబి రంగు పురుగు ఉధృతిని తగ్గించుకోవాలన్నారు. కౌలు రైతులు కౌలు కార్డులు తీసుకొని పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ డబ్బులు జమ కాని రైతులు బ్యాంకు ఖాతాకు అధార్ లింక్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయరాజు, ఏవో శ్రీనివాసనాయక్, ఏఈవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెంటారెడ్డి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండల పరిధిలోని పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కాసు పెంటారెడ్డి నియమితులయ్యారు. కాసు పెంటారెడ్డి టీడీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ ఆయనకు సముచిత స్థానం కల్పించింది. తనకు పదవి దక్కడం పట్ల కాసు పెంటారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అందుకు కారణమైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పెంటారెడ్డికి అభినందనలు తెలియజేశారు.

కాజలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్న అబద్దయ్య తదితరులు

మంగళగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామంలో రేషన్ లబ్ధిదారులకు బుధవారం స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో నాణ్యమైన రేషన్ సరుకులు అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ఆలోచన ద్వారా రాష్ట్రంలో కోట్ల మంది ప్రజలకు సులభ రీతిలో సేవలు అందనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, మంగళగిరి పీఏసీఎస్ చైర్మన్ గాదె పిచ్చిరెడ్డి, జనసేన గ్రామ అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, బీజేపీ అధ్యక్షుడు కారుమూరి శ్రీనివాసరెడ్డి, నేతలు దానబోయిన రామరాజు, కుక్కమళ్ల దానియేలు, చింకా కోటేశ్వరరావు, కుక్కమళ్ల విక్రమ్, బీవీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

మంగళగిరి మండలం కాజలోని రైతు సేవా కేంద్రం ద్వారా బుధవారం 220 మంది రైతులకు 440 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గాదె పిచ్చిరెడ్డి యూరియా పంపిణీని పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, జనసేన గ్రామ అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, కూటమి నాయకులు కూరాకుల బాపయ్య, గాదె సుధాకర్ రెడ్డి, చింకా కోటేశ్వరరావు, దొడ్డక గంగరాజు, పులగం పెదరామిరెడ్డి, బీవీఎల్ నారాయణ, రైతు సేవా కేంద్రం ఏఈవో జ్యోతిరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కేంద్రాల్లో పుష్కలంగా ఎరువులు



మాట్లాడుతున్న బుల్లా కిషోర్, పాల్గొన్న రైతులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని, రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లలో పుష్కలంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బుల్లా కిషోర్ అన్నారు. గుంటూరు రూరల్ మండలపరిధిలో జొన్నలగడ్డ, లాలుపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు అధికారుల సూచన మేరకు పురుగు మందులు వినియోగించు కోవాలన్నారు. గ్రామంలోని ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా, సాంకేతిక బదిలీ కేంద్రం కో ఆర్డినేటర్ మనోజ్‌కుమార్, వ్యవసాయ అసిస్టెంట్ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

ఏసీ ఎంఈ స్కూల్లో నూతన క్లబ్ ఆవిష్కరణ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొత్తూరు సమీపంలోని ఏసీఎంఈ స్కూల్లో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ ఆధ్వర్యంలో ఇంటరాక్టివ్ క్లబ్ ఆవిష్కరణ ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ ఎన్ దీప్తి తెలిపారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా కే హరీష్ బీ బృంద నియమితులయ్యారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన వైద్య విద్యార్థులు

మంగళగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న వైద్య విద్యార్థులు బుధవారం గణపతి నగర్‌లోని ఇందిరానగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. యూపీహెచ్‌సీ పనితీరు, వైద్య సేవలు, మందుల సరఫరా తదితర విషయాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

సమ్మెకాల ఒప్పందాల కోసం ఐక్య పోరాటాలు

ఫిరంగిపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమ్మెకాల ఒప్పందాల కోసం ఐక్యంగా పోరాడదామని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జీ రమణ, జిల్లా అధ్యక్షులు ఎంవీ కుమారి పిలుపునిచ్చారు బుధవారం ఫిరంగపురంలోని అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద యూనియన్ సీఐటీయూ ప్రాజెక్టు అధ్యక్షురాలు పీ విజయకుమారి అధ్యక్షతన జరిగిన ప్రాజెక్టు నాలుగో మహా సభలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీణరావు, మండల అధ్యక్షుడు ఎస్ఎం వలీ, వర్కింగ్ ప్రెసిడెంటు ధనలక్ష్మీ ఆర్గనైజింగ్ కార్యాదర్శి పీ విజయ, పార్వతి, రజని, రాజకుమారి, విజయకుమారి అన్నామణిలతో పాటు 15 మందితో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో బుధవారం ఉదయం పెదవడ్లపూడి రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ జి.వెంకటాద్రి తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించలేదని మృతుని వయస్సు 50-55 ఉండవచ్చని తెలిపారు. మృతుడు ధరించిన చొక్కా కాలర్‌పై వీనస్ టైలర్ లంబాడీపేట, విజయవాడ లేబుల్ ఉందన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



కాలనీలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ అధికారులు

పలు కాలనీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కాలనీలలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఆరోగ్య అధికారి మొవ్వా యేసుబాబు పనులు పరిశీలించారు. యడ్ల లింగయ్య కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, పూలే కాలనీలో ప్రత్యేక పారిశుధ్యం చేపట్టారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాధులు వ్యాపించకుండా కాలనీలలో పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. ప్రతి ఇంటి వద్ద నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, భారీ వర్షాల సమయంలో ఇబ్బందులు ఎదురైతే మున్సిపల్ అధికారుల దృష్టికి తేవాలని కోరారు. వ్యాధులు వ్యాపించకుండా నిర్మూలనకు ఫాగింగ్ చేశారు.

బీసీ కాలనీలో వైద్య శిబిరం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 03 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీ వాసులకు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ యేసు బాబు వైద్యసేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నేడు తక్కెళ్ళపాడులో కంటి వైద్య శిబిరం

పెదకాకాని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో నేడు (గురువారం) ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శంకర కంటి ఆస్పత్రి హాస్పిటల్ వైద్యులు తెలిపారు. గ్రామంలోని శివాలయం సెంటర్లో ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. కంటి సంబంధిత సమస్యలు, వ్యాధులు ఉన్నవారు తమ ఆధార్ కార్డుతో వచ్చి ఉచితంగా వైద్య సేవలు పొందాలని వైద్యులు పేర్కొన్నారు.

శ్రీరామ గణేష్ యూత్ అన్నదానం

తెనాలి క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంగం జాగర్లమూడికి చెందిన శ్రీరామగణేష్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 41వ గణేష్ మహోత్సవ వేడుకలు సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం కమిటీ సభ్యులు గ్రామస్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం గ్రామంలో వినాయక ఊరేగింపు అనంతరం నిమజ్జన కార్యక్రమం జరుగుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ప్రియదర్శిని

రైతులు నానో ఎరువులు వినియోగించాలి

● చేబ్రోలు ఏవో ప్రియదర్శిని

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో ఎరువులు వినియోగాన్ని చేపట్టాలని చేబ్రోలు ఏవో ప్రియదర్శిని అన్నారు. మండల పరిధిలోని చేబ్రోలు, శేకూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు యూరియా వాడకం తగ్గించి మిశ్రమ ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. పంటకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు ఒకే ఎరువులో అందుతాయన్నారు. నానో యూరియా, డీఏపీ వాడాలని సూచించారు. రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విలీన ప్రతిపాదిత పంచాయతీల్లో...

అభివృద్ధి ఆమడ దూరం

● న్యాయస్థానాల జోక్యంతో నిలిచిన వైసీపీ ప్రభుత్వ నిర్ణయం
● పాలకవర్గాలు లేక విడుదల కాని ఆర్థికసంఘం నిధులు
● ఆస్తి, నీటి పన్నుల పైనే మనుగడ
● సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వానికి గ్రామస్థుల వేడుకోలు



చింతలపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలంలోని విలీన ప్రతిపాదిత గ్రామాల్లో అభివృద్ధి ఆమడ దూరంలో నిలిచిపోయాయి. పొన్నూరు పురపాలక సంఘంలో సమీప గ్రామాలను విలీనం చేయాలని గత వైసీపీ ప్రభుత్వం ప్రయత్నం చేసింది. అయితే మిగిలిన ప్రక్రియ పూర్తి చేయకపోవడం పంచాయతీల అభివృద్ధి పూర్తిగా కుంటుబడిపోయింది. పొన్నూరు పురపాలక సంఘానికి సమీపంలోని చింతలపూడి కసుకర్రు, వడ్డెముక్కల ఆలూరు, కట్టెంపూడి, ఇటికంపాడు గ్రామాలను వైసీపీ ప్రభుత్వం పురపాలక సంఘంలో విలీనం చేయాలని ప్రతిపాదనలు పంపడమే కాకుండా ప్రభుత్వ ఉత్తర్వులను సైతం జారీ చేసింది. అయితే విలీన ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. న్యాయస్థానాల జోక్యంతో విలీన ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రభుత్వ ఉత్తర్వులు కోర్టు నిలిపివేసినప్పటికీ పంచాయతీలను పంచాయతీరాజ్ వ్యవస్థ నుంచి తొలగిస్తూ వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయం ఆ పంచాయతీలకు శాపంగా మారింది. ప్రస్తుతం ఈ ఆరు గ్రామాలు ఆటు పురపాలక సంఘంలో కానీ, పంచాయతీ వ్యవస్థలో కానీ లేకపోవడం వల్ల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. పంచాయతీలకు ఎన్నికలు లేకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం అందజేసే ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ కాలేదు. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేయాలంటే నిధుల లేమి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

ఐదేళ్లలో నిలిచిన లక్షలాది రూపాయలు

గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా నిలిపివేసింది. ఈ ఐదేళ్ల కాలంలో ఒక్కో గ్రామ పంచాయతీ సగటును రూ.50లక్షల నిధులను కోల్పోయాయి. ఆర్థికసంఘం నిధులు లేకపోవడంతో పంచాయతీల పాలన కష్టసాధ్యంగా మారింది. పంచాయతీల్లో ప్రజలకు అవసరమైన పనుల చేపట్టాలంటే పంచాయతీల అధికారుల దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కేవలం పంచాయతీలకు వచ్చే ఆస్తి, నీటి పన్ను పైనే మనుగడ సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ఈ పన్నుల వసూళ్లు కూడా అరకొరగానే జరగటంతో వచ్చిన నిధులతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించటం సాధారణ పంచాయతీ పాలన చేయడానికి నిధులు సరిపోతున్నాయి. వీధి దీపాల మరమ్మతులు, దోమలు నిర్మూలన కోసం నిర్వహించే ఫాగింగ్ వంటి కార్యక్రమాలకు మాత్రమే ఈ నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గ్రామాల్లో గత ఐదేళ్లుగా నిధులు లేకపోవడంతో మురుగు కాలువల నిర్మాణం, సిమెంట్ రోడ్ల నిర్మాణం వంటి పనుల చేపట్టలేక ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించలేక పంచాయతీ అధికారులు సతమతమవుతున్నారు. పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విలీన గ్రామాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ప్రభుత్వం తక్షణమే స్పందించి విలీన గ్రామాల ప్రజల అభిప్రాయం తెలుసుకునేందుకు గ్రామ సభలు నిర్వహించింది. గ్రామ సభల్లో విలీన గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా పురపాలక సంఘంలో విలీనానికి వ్యతిరేకంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. అయితే నేటి వరకు ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. పంచాయతీల పాలకవర్గాలు లేకపోవడం కూడా ప్రజలకు ఇబ్బందిగా మారింది. పాలకవర్గాలు లేకపోవడం వల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు అధికారులు జంకుతున్నారు. మరో ఏడాది వరకు ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం లేకపోవడంతో నిధుల సాధన ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. లేదంటే గ్రామాల అభివృద్ధి అధోగతి పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకుంటే ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం తమ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులైన కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

విజిలెన్స్ ఏవో సీహెచ్ ఆదినారాయణ



ఎరువుల నిల్వలు తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయించినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఏవో సీహెచ్ ఆదినారాయణ హెచ్చరించారు. బుధవారం పొన్నూరు పట్టణ, మండలంలోని ప్రాథమిక సహకార సంఘాలు, జీడీసీఎంఎస్ పాయింట్లన విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రభుత్వం నుంచి సరఫరా అయిన యూరియా, డీఏపీ నిల్వలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. మార్కెట్‌యార్డులోని జడీసీఎంఎస్ ఎరువుల గోడౌన్, నిడుబ్రోలు, పెదపాలెం సొసైటీల్లో తనిఖీలు చేసి రైతులను విచారించారు. రైతులు యూరియా సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఏవో అనిల్‌బాబు, మండల వ్యవసాయ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ సిబ్బంది వంశీకృష్ణ, జానీ, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పంట నమోదు పూర్తి చేయాలి

● ఏడీఏ విజయబాబు

తెనాలి క్రైం, సెప్టెంబరు 03 (ఆంధ్రజ్యోతి) : రైతుకి ప్రభుత్వం అందించే వివిధ పథకాలు పొందడానికి తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ విజయబాబు తెలిపారు. బుధవారం తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట నమోదు అంశంపై వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈవోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుల నుండి పూర్తి సమాచారం తీసుకుని ఇచ్చిన యాప్‌లో పూర్తి చేయాలని ఏడీఏ కోరారు. కార్యక్రమంలో తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండల వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఐపీఎస్ ఉమేష్‌చంద్ర వర్ధంతి

● చెంచుపేటలో ఏర్పాట్లను పరిశీలించిన సబ్ కలెక్టర్



చెంచుపేట ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీస్తున్న సబ్ కలెక్టర్ సంజన సింహ, డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర వర్ధంతి గురువారం చెంచుపేటలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లను సబ్ కలెక్టర్ సంజనా సింహ డీఎస్పీ జనార్ధనరావు, అధికారుల బృందం బుధవారం సమీక్షించారు. ప్రధాన రహదారి కూడలిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద నివాళులర్పించే కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పశ్చిమ గోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పాల్గొననున్నారు.

పాల రైతులకు బోనస్ పంపిణీ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాల రైతులకు సంగం డెయిరీ చేయూతనందిస్తుందని డైరెక్టర్ బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని 7గ్రామాల్లో బుధవారం 215మంది పాల రైతులకు సంగం డెయిరీ ఆధ్వర్యంలో బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. మండల పరిధిలోని వల్లభరావుపాలెం సొసైటీ పరిధిలో 42మందికి రూ.1.39లక్షలు, పెదపాలెం సొసైటీలో 36మందికి రూ.36వేలు, వై.మురళీకృష్ణ వెండర్ పాయింట్‌లో 15మందికి రూ.20వేలు, కసుకర్రు సొసైటీలో 35మందికి రూ.1.16లక్షలు పెద ఇటికంపాడు సొసైటీలో 38మందికి రూ.54వేలు, టి.రామచంద్రయ్య వెండర్ పాయింట్లో 34మందికి రూ.1.11లక్షలు, టి.హైమావతి వెండర్ పాయింట్లో 32మందికి రూ.1.10లక్షల నగదు బోనస్‌ను డైరెక్టర్ రామారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ తేలప్రోలు వీరేంద్రకుమార్, సంగం సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ, జె.రవీంద్రనాథ్, షేక్ జమీల్ బాషా, సంగం అధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అమృతలూరు మండలాన్ని గుంటూరు జిల్లాలో విలీనం చేయాలి

● మంత్రికి వినతి



మంత్రి మనోహర్‌కు వినతిపత్రం అందిస్తున్న అమృతలూరు మండల గ్రామాల ప్రజలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమృతలూరు మండలాన్ని గుంటూరు జిల్లాలో విలీనం చేయాలని పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు బుధవారం తెనాలిలో మంత్రిని కలిసి జిల్లాల పునర్విభజన నేపథ్యంలో మండలానికి న్యాయం చేయాలని కోరారు. తెనాలి ప్రాంతంతో అవినాభవ సంబంధం ఉన్న మండలం గత పాలకుల అనాలోచిత నిర్ణయం కారణంగా బాపట్ల జిల్లాలో కలిపారన్నారు. దీని కారణంగా దూరంగా ఉన్న బాపట్ల వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మండలంలో ఎక్కువ సంఖ్యలో ప్రజలు విద్య, వైద్యం, ఉద్యోగం తదితర అవసరాల కోసం తెనాలిలో మరో నివాసం ఏర్పాటు చేసుకున్నారని, జిల్లా కేంద్రం గుంటూరు చేరుకునేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. మండల ప్రజల కోరిక మన్నించి కమిటీలో సభ్యునిగా ఉన్న మంత్రి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో రోడ్ల వెంట మొక్కలు నాటించాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని గ్రామాల్లో రోడ్ల వెంట మొక్కలు నాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కిలో మీటరు వరకు తప్పనిసరిగా మొక్కలు నాటే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా పూర్తి సబ్సిడీపై ఇస్తున్న ఉద్యానవన పంటల గురించి రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు నిమ్మ, జామ, సీతాఫలం, కొబ్బరి, గులాబీతోటలు, పశుగ్రాసం వేసుకుంటే పూర్తి సబ్సిడీతో మొక్కలు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, ఏపీడీ శ్రీమన్నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, ఏపీవో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో అమరజీవి విగ్రహ ఏర్పాటు హర్షణీయం

● అమరజీవి పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి వెంకటశివరామకృష్ణ



ప్రదర్శనగా తరలివెళ్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని శాఖమూరు గ్రామంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటు హర్షణీయమని అమరజీవి పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి తాటికొండ వెంకటశివరామకృష్ణ అన్నారు. పట్టణంలో బుధవారం అమరజీవి పవిత్రస్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి ఆర్యవైశ్య సంఘం నాయకులు శాఖమూరు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితమే ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. త్యాగధనుడి స్మారకంగా 58అడుగుల ఎత్తయిన విగ్రహం ఏర్పాటుచేయడంపై కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. విగ్రహ శంకుస్థాపన మంత్రి నారా లోకేశ్ చేయటంపై స్వాగతించారు. కార్యక్రమంలో సమితి పట్టణ అధ్యక్షులు పోలిశెట్టి వెంకటసుబ్బారావు, కొమ్మూరి భీమేశ్వరరావు, తాటికొండ ఉమామహేశ్వరరావు, పోలిశెట్టి రోశయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించాలి

● వర్సిటీ ఉపకులపతి ఆచార్య గంగాధరరావు



మొక్కలు నాటుతున్న వీసీ గంగాధర్ రావు

ఏఎన్‌యూ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంపొందించాలని, అది ప్రతి ఒక్కరి బాధ్యత అని వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే.గంగాధర రావు అన్నారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర వసతి గృహం సముదాయంలో అమరావతి హాస్టల్ వద్ద బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పునరంకితం కావాలని, విద్యార్థుల సామూహిక కృషితోనే సాధ్యమవుతుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వసతి గృహాల సముదాయాలలో కల్పించడంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, వోఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, వర్సిటీ బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య కే.మల్లికార్జున, విద్యార్థులు, పాల్గొన్నారు.

వైద్యచికిత్సకు రూ.3 లక్షల సాయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన కోటా మానస వైద్య చికిత్స నిమిత్తం రూ.3 లక్షల సాయం అందించారు. తెనాలి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సీఎం సహాయ నిధి చెక్కును బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



అత్తోటలో ఆక్రమణలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సంజనాసింహ

ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయండి

● సబ్ కలెక్టర్ సంజనాసింహ

కొల్లిపర, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేయాలని సబ్‌కలెక్టర్ సంజనాసింహ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని అత్తోట, దావులూరిపాలెం గ్రామాల్లో ఆక్రమణలకు గురవడంతో గ్రామస్థులు గ్రీవెన్స్‌లో దరఖాస్తులు అందజేశారు. దీంతో బుధవారం సబ్ కలెక్టర్ సంజనాసింహ ఆయా గ్రామాల్లో పర్యటించి ఆక్రమణలను పరిశీలించారు. అదేవిధంగా మండల పరిధిలోని దావులూరులో అనధికారంగా ముగ్గురు రైతులకు 19సెంట్ల భూమి, చెముడుబాడులో 5సెంట్ల భూమి వెబ్‌ల్యాండ్‌లో నమోదు కావడంతో ఆ భూములను కూడా పరిశీలించి వారికి కూడా నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ సిద్ధార్థ, డీఎల్‌పీవో స్వరూపరాణి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, ఆర్ఐ వంశీకృష్ణ, మండల సర్వేయర్ హరికృష్ణ తదితరులు ఉన్నారు.



తెనాలి బస్‌డిపోను పరిశీలిస్తున్న డీపీటీవో విమల

తెనాలి బస్ డిపోలో మెరుగైన పనితీరు

● డీపీటీవో విమల

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెనాలి బస్ డిపోలో పనితీరు మెరుగయ్యిందని స్త్రీ శక్తి పథకంలో అక్యుపెన్సీ పెరిగిందని జిల్లా ప్రజా రవాణా అధికారి విమల చెప్పారు. తెనాలి ఆర్టీసీ డిపోను బుధవారం ఆమె తనిఖీ చేశారు. మహిళా ప్రయాణికులను స్త్రీ శక్తి పథకంలో ఇబ్బందులను తెలుసుకున్నారు. మహిళ కండక్టర్లతో మాట్లాడి ప్రయాణంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జీరో ఫెయిర్ టిక్కెట్ జారీపై సమీక్షించారు గ్యారేజీలో మెకానిక్‌లతో మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, స్త్రీ శక్తి పథకం నేపథ్యంలో అన్ని బస్సు డిపోలను పరిశీలించి పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రయాణికుల అక్యుపెన్సీ దృష్టిలో ఉంచుకుని సర్వీసుల సంఖ్యను పెంచే ఆలోచన చేస్తామన్నారు. మొరాయించకుండా నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇంజన్ సామర్థ్యానికి అనుగుణంగా మారుస్తూ ఉండటం జరుగుతుందన్నారు. వాహనాల నిర్వహణ సరిగా ఉంటే బస్సులు మధ్యలో మొరాయించే సమస్య రాదన్నారు. నాన్‌స్టాప్ సర్వీసుల పునరుద్ధరణపై సర్వే చేయించి అవసరాన్ని బట్టి నడుపుతామన్నారు. కరోనా తరువాత ద్విచక్ర వాహనాల సంఖ్య పెరగడంతో ప్రజా రవాణాపై ఆధారపడే వారి సంఖ్య తగ్గిపోయిందన్నారు. డిపో మేనేజర్ రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సైకిల్ మెకానిక్‌కు భారీ గొడుగు సాయం



గొడుగు అందజేస్తున్న సేవా కేంద్రం సభ్యులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్లగా సైకిల్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్న నక్కా వెంకటేశ్వర్లుకు గొడుగును అందజేశారు. సత్యం శివం సుందరం సేవా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఈ సాయం అందించారు. సేవా కేంద్రం నిర్వాహకులు నగరాజకుమారి ఆర్థిక సహకారంతో అందజేశారు. ఎండాకాలంలో ఆరుబయట పని చేసుకుంటున్న ఆయనకు ఈ సాయాన్ని అందజేశారు. తన్నీరు శివశంకర్, మాలేపాటి హేమ కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెంకట్

ఎన్‌సీసీ అధికారి వెంకట్‌కు ప్రశంసా పత్రం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారీసుపేట ఎన్‌సీఆర్ఎన్ఎం హైస్కూల్‌లో ఎన్‌సీసీ అధికారిగా పనిచేస్తున్న బెల్లంకొండ వెంకట్ రాష్ట్ర సమగ్రశిక్ష ప్రశంసా పత్రం అందుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయడంతో పాటు విద్యార్థులలో, గ్రామ, పట్టణ ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ సోషల్ మీడియాలో చురుకుగా పాత్ర పోషిస్తున్న వారిని సమగ్ర శిక్ష ఎంపిక చేసింది. ఎంపికైన 40మందికి విజయవాడలో ఆగస్టు 30న శిక్షణ ఇచ్చారు. వారు అందిస్తున్న సేవలను అభినందించి ప్రశంసాపత్రం బహూకరించారు. జిల్లాలో ముగ్గురు ఎంపిక కాగా అందులో ఒకరైన వెంకట్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.